PRAMUKHANDHRA 29th Year of Publication We carry the news and views of Telugus




వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీ రామారావు

29 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర

₹.15
ఏప్రిల్ 2023



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA

# అమ్మ దయ వుంటే అన్నీ వున్నట్టే!



**పరమాత్ముడైన హరి పట్టపురానివి నీవు**

**ధర మమ్ము విచారించదగు నీకు నమ్మా**

- అంటూ అన్నమయ్య కీర్తనలో అమ్మవారిని స్తుతించాడు. పరమాత్ముడైన శ్రీహరికి పట్టపురాణివి నీవు. మా అందరి బాగోగులు , మంచి చెడ్డలు చూడవమ్మా , తల్లీ ఆదిలక్ష్మి , నీ పతికి విన్నవించి మమ్మల్ని దయతో పాలించమని చెప్పమ్మా. ఓ పద్మాసిని , వేంకటపతిరాణి. అయ్యవారి బంటులమైన మాకు ఇహ పర సౌఖ్యాలు అనుగ్రహించావు. స్వామి నీవు మమ్మల్ని చక్కగా పాలిస్తున్నారమ్మా. మాకు చాలా ఆనందంగా వుందమ్మా అంటూ అన్నమయ్య అమ్మవారిని స్తుతించాడు.

ఇప్పటివరకూ తిరుచానూరులోనే అమ్మ ఆలయం వుండగా తొలిసారి బయట ప్రాంతమైన చెన్నైలో అమ్మ ఆలయం నిర్మింపబడటం చెన్నైవాసులకు పండగే. అమ్మ అంటేనే ప్రేమ.అందరికీ అన్నింటికి , సర్వసృష్టికి జన్మ నిచ్చినది అమ్మే.పశుపక్ష్యాదులకు క్రిమికీటకాలకు అమ్మ లేనిదే జీవనం లేదు కదా. ఆ అమ్మ చెన్నైవాసులను ఆశీర్వదించటానికి , తన ప్రేమామృతాన్ని పంచటానికి ,వాత్సల్యమూర్తి , కరుణామయి అలమేలుమంగమ్మ తల్లి పద్మావతిదేవి మార్చ్ 17శుక్రవారం నాడు తిరుచానూరులో కొలువైన అమ్మ చెన్నై వచ్చింది. అవును తిరుచానూరు తరువాత తొలి ఆలయం చెన్నయే. ఈ అద్భుతం జరగటానికి మరో బంగారు మనసున్న అమ్మ కారణం. అంతేగా మరి కాంచనం అంటే బంగారమే కదా. ఏవి ఆశించకుండా బంగారంలాంటి కోట్ల విలువచేసే ఆస్తిని అమ్మ చెన్నై రావటానికి అందించిన కాంచన గొప్ప మనసుని మనం గుర్తు చేసుకోవాలి. నేను తిరుమల వెళ్ళినపుడల్లా మొదట తిరుచానూరు వెళ్ళి విన్నపాలు వినవలే అంటూ కష్టసుఖాలనన్నిటిని చెప్పుకుని , నేను తిరుమల కొండకెళ్ళే లోపు కోరిన కోర్కెలు తీర్చే కోనేటిరాయునికి సిఫారసు చెయ్యమంటూ ప్రార్థించి వెళ్ళేవాడిని. ఇప్పుడేమో ఆ తల్లి ఇక్కడకే వేంచేసి అడుగు నీకేం కావాలో అన్నట్టుగా వుంది. ఆ ఆలయం కుంబాభిషేకం అయిన రోజునుండి ఈరోజు వరకూ జనరద్దీ అలాగే వుంది.కుంబాభిషేకం జరిగిన ఉదయం మండు వేసవిన వర్షం కురవటం శుభసూచకంగా అనిపించింది. అంతేనా ఆ తల్లి చల్లని చూపు చెన్నైవాసులపై కురిపించినట్టయ్యింది.

ఇక తిరుమల తిరుపతి దేవస్థానం తిరుపతి వారి ఆదేశాలను చెన్నై బోర్డ్ ఆచరిస్తూ బ్రహ్మాండమైన ఏర్పాట్లను చేసింది. నేరుగా వెళ్ళి చూడలేకపోయామే అని తలంచిన భక్తులకు ఆలయ కుంబాభిషేక ప్రత్యక్ష ప్రసారం అన్ని టీవీలలోను ప్రసారమయ్యింది మరియు భక్తులందరికి మూడు రోజులు అన్న ప్రసాదాన్ని ఉచితంగా అందించారు.

మార్చ్ 12 ఆదివారం పుణ్యాహవచనం తో ప్రారంభించి జలాధివాసం అష్టబంధన మూలవిగ్రహ ప్రతిష్ఠ , మహాకుంభ సంప్రోక్షణ ఆరు రోజులపాటు చక్కగా జరిగాయి. కుంబాభిషేకం తదుపరి పద్మావతి శ్రీనివాస కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది.






Continued on Page No. 19




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఏప్రియల్ 2023

సంపుటి : 29 **341** సంచిక : 4




# మధురమైన తెలుగు భాషణా భూషణాన్ని మసకబారనీయవద్దు!

చీమలు దూరని చిట్టడవుల్లో కూడా తెలుగు భాష చొరబడి వినిపించేది. ప్రపంచ దేశాల్లో భారతీయులే అధికంగా ఉంటున్నారు; వారిలో తెలుగువారే గణనీయంగా ఉంటున్నారు. వారందరూ తెలుగును వ్రాయడం, చదవడం తెలియకపోయినా, చక్కగా తెలుగును మాట్లాడగలరు. వారికి ఆంధ్ర ప్రభుత్వం వాచకాల్నూ, ఉపవాచకాలనూ అందిస్తూ ప్రోత్సహిస్తే, వారింకా మాతృభాషను గుండెల్లో భద్రంగా దాచుకుంటారు.

అమెరికాలో అనేక తెలుగు సంఘాలున్నప్పటికినీ, వారు రాజకీయ నాయకుల మెప్పుల కోసమో, సినిమా వాళ్ళ గ్లామరు కోసమో తపన పడుతున్నారే తక్క తమ భాష వ్యాప్తికోసం అంతగా తపించడం లేదు. వారు బోధనాపరంగా, తెలుగు ఉపాధ్యాయులను రావించే కృషిచేస్తే వ్రాతపరంగా తెలుగు ప్రాచుర్యంలో ఉంటుంది. చదువగలిగే అవకాశం ఉంటుంది.

కొన్ని తమిళ సంఘాలు ఈ విషయంగా కృషిచేస్తున్నట్లు వింటున్నాం. తెలుగు సంఘాలవారు తమిళులు కృషి చేస్తున్నట్టుగా కృషిచేస్తున్నట్లు తోచదు. 'మనబడి' కార్యక్రమం కృషిచేస్తున్నదని విన్నాం. ఆ కృషి చాలదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణా ప్రభుత్వములిరువురూ శ్రద్ధ వహించాలి. అక్కడి తెలుగువారికి తెలుగువాచకాలు పంపాలి. తెలుగు భాషా సంఘాలు, తెలుగు భాషా వ్యాప్తికి కృషి చేయాలి. అక్కడి తెలుగువారికి భాష చక్కదనాన్ని చిక్కగా చెప్పాలి. మూడు రోజుల వేడుకల ముచ్చటగా తెలుగు సంఘాలు బాధ్యత తీరిందనుకోరాదు. తెలుగు బోధనా ప్రక్రియకు దోహదకారి కావాలి!

ఇక మన భారతదేశం విషయానికి వస్తే, హిందీ మాట్లాడే వారి తరువాత, తెలుగు మాట్లాడేవారి సంఖ్య అధికం. కానీ, ఇటీవల 2011 జనాభా లెఖ్ఖల ప్రకారం తెలుగు మాట్లాడే వారి స్థానం నాలుగోస్థానానికి పడిపోయిందంటున్నారు. 1971 సం॥ములో 8.16 శాతం ఉండగా, ఇప్పుడు 6.70 శాతానికి దిగజారిందంటున్నారు. మరాటీ భాష మాట్లాడే వారు ఓ మెట్టు పైకెక్కారంటున్నారు. హిందీ మాట్లాడే వారి సంఖ్య మాత్రం నానాటికీ పెరిగిపోతూనే ఉందట.

భారతదేశంలో మాట్లాడే 22 షెడ్యూల్డు భాషల్లో హిందీ భాష మాట్లాడేవారి సంఖ్య పెరుగుతున్నది. గానీ ప్రాంతీయ భాషలు మాట్లాడేవారి సంఖ్య పెరగడం లేదు. ముఖ్యంగా ఆ భాషల్లో తెలుగు భాష ఉన్నది.

దేశంలో ఇంగ్లీషు ప్రభావం ఉంటుందంటున్నారు గానీ, గత దశాబ్దంతో పోలిస్తే, తెలుగుభాషాభివృద్ధి రేటు పెద్దగా పెరగలేదు. 1971సం॥ములో 1.91 కోట్లుండగా, ఇప్పుడది 2.59 కోట్లకు చేరింది.

దేశంలోని 99 నాన్ షెడ్యూల్డు భాషల్లో 17 భాషలు కనుమరుగయ్యాయి. ఆ భాషలను మాట్లాడే సంఖ్య మైనస్‌లో పడిపోయిందనే చెప్పాలి. 2011 జనాభా లెఖ్ఖల ప్రకారం దేశవ్యాప్తంగా 8.11 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్‌లో 7.06 కోట్లు కాగా, కర్నాటకలో 35 లక్షలు, తమిళనాడులో 42 లక్షలు, మహారాష్ట్రలో 13 లక్షలు, ఒరిస్సాలో 6.6 లక్షలు, చత్తీస్‌ఘడ్‌లో 1.5 లక్షలు, పశ్చిమబెంగాల్‌లో 88 లక్షలు, పుదుచ్చేరిలో 74 వేలు, గుజరాత్‌లో 73 వేలు, అండమాన్ దీవుల్లో 50 వేలు, ఢిల్లీలో 25 వేల మందీ తెలుగు మాట్లాడే వారున్నట్లు తెలుస్తూన్నది. భారతదేశంలో తెలుగు మాట్లాడేవారు 3వ స్థానంలో ఉండేవారు. ఇప్పుడు 4వ స్థానంలోకి పడిపోయారు. హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే తెలుగు భాషా స్థానంలో బెంగాలీ భాష వచ్చింది. తెలుగువారు తెలుగునే మాట్లాడాలనే నిబంధనను పాటిస్తే తెలుగు నాలుగవ స్థానానికి దిగజారకపోవచ్చు. మనం ఐదవతనాన్ని (పుణ్యస్త్రీ తత్వాన్ని) నిలుపుకోవచ్చు. నిలుపుకుంటారనే నా నమ్మకం.

**తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను అన్న భావన ప్రతీ తెలుగు వానికి కలగాలి. ఏ దేశమేగినా, ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవంబు అను భావన ప్రతీ తెలుగువాని మనసులోనూ దృఢంగా ఉండాలి. ఆచరణలో నిత్య సత్యతను చూపాలి! అప్పుడే తెలుగువాడివనే మననం కలుగుతుంది. తెలుగు వికసింపబడుతుంది.**

**జై తెలుగు తల్లీ! ఎనిమిది కోట్ల**
**ఆంధ్రుల కల్పవల్లీ! వర్ధిల్లు!!**
**జయము జయము నీకు!**
**జయము జయము మనకు!**



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

(సెప్టెంబరు 2018)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# గురువాక్కు మహత్యం

ఒకానొకప్పుడు ఒక గురువు గారు, ఆయన శిష్యుడు నది నుండి వారి ఆశ్రమానికి తిరిగి వెళ్తున్నారు.

ఇంతలో హఠాత్తుగా గురువుగారు ఒక మహావృక్షం ముందు ఆగి ప్రసన్నంగా నవ్వుతూ "తథాస్తు" అన్నారు.

గురువుగారి చర్యకి కారణం ఏంటి? అని అడిగాడు శిష్యుడు.

"ఆ మహావృక్షం తన కోరికని పక్కనున్న మరో వృక్షంతో చెప్తుంటే నాకు వినబడి 'తథాస్తు' అన్నాను."

"ఏమిటా కోరిక గురువు గారూ?"

"తాను చక్రవర్తి అయి భూమండలాన్ని ఏలాలని."

"వచ్చే జన్మలోనా?"

"కాదు ఈ జన్మలోనే"

శిష్యుడు పగలబడి నవ్వాడు, "గురువు గారూ, ఇది మరీ గొంతెమ్మ కోరిక కదూ! అంత అత్యాశ తగునా? అరత చూసుకోవాల్సిన పనిలేదా? "

"అరతకేం నాయనా! జీవితమంతా ప్రతఫలాపేక్ష లేకుండా ఫలాలనిచ్చింది. ఎన్నో జీవరాశులకి ఆశ్రయం ఇచ్చింది. అదంతా పుణ్యమే కదా!"

"అవుననుకోండి. కానీ చెట్టు చక్రవర్తి ఎలా అవుతుంది" అన్నాడు శిష్యుడు.

అది విని "ఏమో, భగవానుడు సంకల్పిస్తే ఏమైనా కావచ్చు!" అన్నారు గురువుగారు.

ఆ రాత్రి పెద్ద గాలివాన వచ్చి ఆ మహా వృక్షం నేలకూలింది.

శిష్యుడు నవ్వుకున్నాడు. అంతటితో ఆ విషయం మరిచిపోయాడు.

సరిగ్గా సంవత్సరం తరువాత

ఒక్కరోజు ఆ శిష్యుడు పరుగు పరుగున వస్తూ "గురువు గారూ, ఈ వింత విన్నారా! శ్రీరామచంద్రులవారి పాదుకలకి పట్టాభిషేకం చేశారు వారి సోదరులు భరతులవారు. ఇక నుండీ పద్నాలుగేళ్ళు పాదుకలు సామ్రాజ్యాన్ని పరిపాలిస్తాయట!" అన్నాడు.

దానికి గురువు గారు నవ్వి, "చెట్టు చక్రవర్తి ఎలా అవుతుంది అన్నావు. ఇప్పుడు అయింది కదా!" అన్నారు.

అంటే? అడిగాడు శిష్యుడు.

అవున్నాయనా, ఆ మహావృక్షం కలపతోనే వడ్రంగులు పాదుకలు చేశారు. అవి శ్రీరామచంద్రుల వారికి సమర్పించారు. ఎన్ని జన్మలు ఎంత తపస్సు చేసిందో, ఎన్ని పుణ్యాలు చేసుకుందో, ఆ మహావృక్షం పాదరక్షలుగా మారి శ్రీరామ చంద్రులవారి పాదాల వద్దకు చేరింది.

శ్రీరామచంద్రులవారు ఆ పాదుకల్ని భరతుల వారికివ్వడం, భరతులవారు పాదుకలకి పట్టాభిషేకం చేయడం అంతా ఒక్కరోజులో జరిగిపోయింది.

ఆ విధంగా చక్రవర్తి కావాలన్న ఆ మహా వృక్షం కోరిక నెరవేరింది.

అని చెప్పిన గురువు గారికి సాష్టాంగ ప్రణామం చేశాడు ఆ శిష్యుడు.

సద్గురువు వాక్కు సత్యం అయ్యి తీరుతుంది.

కాదు కాదు, ఆ భగవంతుడే మహాత్ముల నోటినుంచి వచ్చిన మాటలు నిజమయ్యేలాగా సంకల్పిస్తాడు.

# థామస్ మన్రో/రాఘవేంద్రస్వామి





క్రీ.శ. 1800లో థామస్ మన్రో బళ్ళారికి కలెక్టర్‌గా ఉండగా ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టిన ఒక చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఏదయినా ఆధ్యాత్మిక సంస్థ యజమాని మరణిస్తే, ఆ చట్టం ప్రకారం, ఆధ్యాత్మిక సంస్థలు విరాళంగా అందుకున్న భూములు, ఆస్థులు, ఈస్ట్ ఇండియా పరమవుతాయి. ఆ చట్టంప్రకారం, మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం ఆస్తులు, స్వాధీనపరుచుకోవటానికి మన్రో మఠానికి వెళ్ళారు. ఆయన చెప్పులు తీసి లోపలికి ప్రవేశించి, బృందావనం దగ్గర నిలబడగానే, బృందావనం పారదర్శకంగా మారి లోపల కాషాయ వస్త్రాలతో, ప్రకాశవంతంగా చిరునవ్వుతో, రాఘవేంద్రస్వామి దర్శనం ఇచ్చారు. స్వామి అతనితో స్పష్టంగా దారాళమైన ఆంగ్లంలో మాట్లాడారు. కాసేపు మాట్లాడిన పిమ్మట, మన్రో అక్కడ నుండి వెళ్ళిపోయారు. అక్కడే ఉన్న మిగిలినవారికి, బృందావనం సాదారణ కట్టడంగానే కనిపించింది. మన్రో ఎవరితో మాట్లాడుతున్నారో అర్థం కాలేదంట. తనకి భౌతికంగా కనిపించి తనతో మాట్లాడారు కాబట్టి, స్వామి జీవించి ఉన్నట్టే అని భావించి, చట్టం నుండి, మంత్రాలయం మఠానికి మినహాయింపునిచ్చారు. ఈ గెజెట్ ఇప్పటికీ అందుబాటులో ఉందంట. ఆయన తన డైరీలో, "వాట్ ఎ మేన్? ఆ కళ్ళలో కాంతి, మృధువుగా పలికినా శాసించే స్వరం, దారాళమైన ఆంగ్లం మాట్లాడారు" అని వ్రాసుకున్నారంట.

గండి లోయలో వాయుదేవుడు ధ్యానంలో ఉండగా, సీతమ్మవారిని వెతుకుతూ శ్రీరాముడు అటుగా వచ్చాడు. వాయుదేవుడు తన ఆతిధ్యం స్వీకరించమని కోరగా, తిరుగు ప్రయాణంలో వస్తానని మాట ఇచ్చాడు రామయ్య. లంకలో రాముని విజయ వార్త చెవినపడ్డ వాయుదేవుడు, తిరుగు ప్రయాణంలో, అటుగా వచ్చే రాముని విజయానికి గుర్తుగా, లోయపైన, ఒక బంగారు తోరణాన్ని అలంకరించాడు. ఆ తోరణం ఇప్పటికీ, పవిత్రాత్మ కలిగిన వారికి, కనిపిస్తూ, ఉంటుంది. ఆ తోరణం కనిపించినవారికి, మరుజన్మ ఉండదని ప్రశస్తి.

థామస్ మన్రో మద్రాసు గవర్నర్‌గా తన పదవీకాలం ముగుస్తుండగా, చివరిసారి అన్ని ప్రాంతాలనూ దర్శించటానికి బయలుదేరినప్పుడు, గండి క్షేత్రంలో లోయగుండా, గుర్రాలపై సాగుతున్నాడు. హఠాత్తుగా తల ఎత్తి చూస్తే, ఎత్తులో బంగారుతోరణం కనిపించింది. "ఇంత అందమైన బంగారు తోరణం అంత ఎత్తులో ఎవరు అలంకరించారు?" అని, తన వెనుక వస్తున్న సేవకుల్ని అడిగారు. సేవకులు చుట్టూ చూసి, తమకి ఏమీ కనిపించటం లేదని చెప్పారు. వారిలో ఒక ముసలి సేవకుడు మాత్రం, అది కేవలం పవిత్రమైన ఆత్మ కలవారికే కనిపిస్తుందని చెప్పాడు. కానీ దానిని చూసినవారు, కొద్దిరోజుల్లోనే మరణిస్తారని చెప్పాడు. మన్రో అప్పటికి మౌనంగా ఊరుకున్నారు. కానీ ఆరునెలలలోపే, కలరాతో మరణించారు.

చిత్తూరు కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో, పెద్ద వెండి గంగాళాన్ని, తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి, కానుకగా ఇచ్చాడు. దీనినే మన్రో గంగాళం, అంటారు. నేటికీ, స్వామివారికి, దీనిలోనే నైవేద్యం పెడతారు.

ఒక ఆంగ్లేయునికి, మనదేశంలో, ఇన్నివిధాలుగా, దేవుని తార్కాణాలు లభించినాయి.

# పరమార్థ కథలు



శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

## సోమరి శిష్యుడు

ఒకానొకాశ్రమములో ఒక గురువు ఒక శిష్యుడు నివసించుచుండిరి. ఇరువురకును వేరు వేరు కుటీరములు కలవు. ఆ కుటీరములు తాటియాకుతో బాగుగ కప్పబడి యుండెను. ఒకనాడు సాయం సమయమున గొప్ప పెనుగాలి వీచగా గురువుగారి కుటీరముపై గల తాటియాకులలో రెండు, ఊడి గాలికి కొట్టుకొనిపోయెను. గురువు వెంటనే శిష్యుని పిలిచి "ఒరే నాయనా! కుటీరముపై తాటియాకులలో రెండు లేచి పోయినవి. ఎక్కడ పోయినవో చూచి తెచ్చి వాటిని యథా స్థానములో పెట్టరా"అనెను. శిష్యుడు ఏ ఘడియలో పుట్టెనోగాని సోమరితనమును బాగుగ అలవాటు చేసికొనెను. మూర్తీభవించిన మహాబద్ధకమే అతడు. తమోగుణము అతనికి ఒడలంతా వ్యాపించి యుండెను. కూర్చున్నవాడు లేవలేడు. గీతలో చెప్పిన "దీర్ఘసూత్రి"కి వాడు ప్రబలదృష్టాంతము, ఇట్టి స్థితిలో అతడు గుర్వాజ్ఞను పాలించునా? వెంటనే యతడు గురువుగారికీ సమాధానమును చెప్పివైచెను."మహాప్రభో! ఇపుడు చీకటిపడినది. చీకటిలో ఎక్కడ వెదకుదును? వెదకినా అవి కనిపించునా? కనిపించినా వాటిని తెచ్చి కుటీరముపై పెట్టుట ఎట్లు? ఎచట చూచినా అంధకారబంధురముగా నున్నది. కాబట్టి రేపు ప్రొద్దున తప్పకుండా తెచ్చి కప్పెదను క్షమించండి!"

ఆరోజు రాత్రి ఎట్లో గడచిపోయెను. రాత్రంతయు చలిగాలి చేతను, వర్షపుతుంపరలచేతను గురువుగారు చాల బాధపడిరి. తాటియాకులు లేచిపోవుటచే ఏర్పడిన బిలమునుండి వర్షజలము లోనికి పడుటవలన గురువుగారి కుటీరములోని పుస్తకములు, దర్భాసనము,కమండలువు, జపమాల మొదలైనవన్ని తడిచిపోయెను.

తెల్లవారగనే గురువు శిష్యుని కేకవేసెను. కాని వాడు అతినిద్రలో ఉండుట వలన పలుకలేదు. మూడు కేకలు వేసినప్పటికిని రానందుచే గురువు తానే శిష్యుని కుటీరము వద్దకు పోయి ఆ కలియుగ కుంభకర్ణుని నిద్రలేపి తన కుటీరమునకు గొనివచ్చి "ఒరే శంభూ! ఆ రెండు తాటాకులు కప్పరా?" అనెను. వెంటనే శిష్యుడు కండ్లు నలుపు కొనుచు "స్వామీ! వర్షము జోరున కురియుచున్నది. ఈ సమయమున కప్పుటకు సాధ్య పడదు. వర్షము ఆగిన వెంటనే తమ ఆజ్ఞ పాలింప గలవాడను" అని చెప్పి మరల పరుండెను.

కొంతసేపటికి దైవము అనుకూలించుటచే వర్షము క్రమముగ తగ్గుచువచ్చి మరికొంతసేపటికి పూర్తిగ నిలిచి పోయెను. వెంటనే గురుదేవుడు శిష్యునిలేపి ఈ ప్రకారముగ చెప్పెను. "ఒరే శంభూ! వర్షము ఆగిపోయినది. ఆ రెండు ఆకులు కప్పరా?"ఆ వాక్యములను విని శిష్యుడు ఆలోచనలోపడెను.

శిష్యుని ఆలోచన చూచి గురువు అతడు కార్యమున కుపక్రమింపబోవుచున్నాడని పరమానందపడెను. ఇక తన కుటీరము బాగు పడెనేయని ఉవ్విళ్ళూరెను. కాని ఎంతసేపు వేచిచూచినను శిష్యుడు కదలలేదు. అంతట గురువు ఆశ్చర్య సంభరితమానసుడై శిష్యుని నిట్లు ప్రశ్నించెను. 'ఏమిరా! శంభూ! వర్షము ఆగిపోయి చాలసేపయినది! తాటాకులు కప్పవేమి?" వెంటనే శిష్యుడు ఈ ప్రకారముగ ప్రత్యుత్తర మిచ్చెను. మహాప్రభూ! తమ ఆజ్ఞను శిరసావహించవలెననియే నాఅభిప్రాయము. కాని ఇపుడు వర్షము ఆగిపోయినది. కాబట్టి కప్పవలసిన అవసరము నాకు కనిపించుటలేదు. చక్కటి ఎండ కాయుచున్నది,

ఈ సారి వర్షము వచ్చినచో అని చెప్పి నెమ్మదిగా తన కుటీరమునకు వెడలి పోవుచుండ గురువు వానిని ఆపి కూర్చుండబెట్టి "ఒరే శంభూ! ఇంత సోమరిగా ఉన్న నీవు ఎప్పుడు కడతేరతావు? ఎపుడు చేయవలసిన పనిని అపుడే చేయవలెను. ఈ దైవమార్గములో, పరమార్ధ మార్గములో సోమరి తనమునకు ఏమాత్రము చోటీయగూడదు. తెలిసినదా? అని అడుగగా శిష్యుడు బ్రహ్మాండంగా తెలిసినదని జవాబు చెప్పి హృదయపరివర్తన గావించుకొని తోడనే వెళ్ళి ఆ రెండు ఆకులుతెచ్చి కప్పివైచెను.

(చిన్న వయస్సులో ఉన్నవారిని "ధ్యానము చేసికొనుడు" అని చెప్పినచో "ఇప్పుడు దాని అవసరమేమి?" అనియు వార్ధక్యము వచ్చిన పిదప "ధ్యానము చేసికొనుడు" అని చెప్పినచో "ఈ దుర్భరస్థితిలో ధ్యానము ఎటుల చేసికొనగలము?" అని ప్రత్యుత్తరము చెప్పుదురు. వారి వాక్యములు కథలోని సోమరిశిష్యుని వాక్యము లనే పోలియుండును కావున అట్టి అలసత్వమును దులిపివైచి బాల్యమునుండియే జనులు భగవద్ధ్యాన పరాయణులై తరించుదురుగాక!)

**నీతి:- ఏ క్షేత్రమందును సోమరితనమునకు లవలేశమైనను చోటీయరాదు.**

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*



# కార్యదక్షుడు శతృఘ్నుడు



అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా శ్రీరామ లక్ష్మణులను ఉదహరించడం పరిపాటి. అసలు లక్ష్మణ శతృఘ్నులు కవలలు. అయితే భరత శతృఘ్నులు ఒకటిగా కలిసిమెలిసి కాలం గడిపారు. శ్రీ రామాయణంలో శతృఘ్నుని చరిత్ర స్వల్పమైనా ఘనమైనది. భరతుని ఆజ్ఞలను శిరసావహించాడు. అసురసంహారానికి అవతరించిన శ్రీమహావిష్ణువు పాంచజన్య శంఖము అంశ అని కూడా అంటారు. ఆవేశము ఎక్కువ గల శతృఘ్నుడు శ్రీరాముని వనవాసమునకు అసలు కారణము మంథర అని తెలుసుకొని ఆమెను వధించుటకు ఈడ్చుకు వచ్చాడు. చివరకు భరతుని మాటలతో శాంతపడి విడిచిపెట్టాడు. శ్రీరామచంద్రుని వనవాసము నుండి తీసుకువచ్చుటకు భరతుని కూడి చిత్రకూ టమునకు వెళ్ళాడు. కవలలైనందున లక్ష్మణునికి ఆవేశము, ఆగ్రహము శతృఘ్ను నకు వచ్చినదని గమనించవచ్చు.

పాదుకలను పూజిస్తూ నందిగ్రామమున భరతుడు ఉన్నంతకాలము అయోధ్య శతృఘ్నుని రక్షణలో ఉంది. భరతుని ఆజ్ఞానుసారము విషయములను చక్కబరిచేవాడు. శృతకీర్తిని వివాహం చేసుకున్న శతృఘ్నునకు సుబాహు, శత్రుఘాతి అను కుమారులు కలరు.

శ్రీరామచంద్రుడు సీతా పరివార సమేతంగా వచ్చుచున్నాడని హనుమ ద్వారా తెలుసుకున్న భరతుడు అయోధ్యలోనున్న శతృఘ్నుని ఘనమైన స్వాగత ఏర్పాట్లు చేయమని ఆజ్ఞాపించెను. రావణ సంహారము గావించి పుష్పక విమా నములో వచ్చుచున్న శ్రీరామచంద్రుని ఆగమన వార్త శతృఘ్నుని పరమానంద భరితుణ్ణి చేసింది. వెంటనే అయోధ్యను సర్వసుందరంగా అలంకరింపచేసాడు. రాజ మార్గములు, చిన్నచిన్న త్రోవలు కూడా సరిచేయించాడు. సప్తవర్ణమయంగా అయోధ్య నగరాన్ని క్షణాలలో తీర్చిదిద్దాడు. మితభాషి అయిన శతృఘ్నుడు కార్యరంగమున మాత్రం విశేషమైన ప్రతిభను చూపించడం గమనించవచ్చు.

శ్రీరాముని వెంట లక్ష్మణుడు నడచినట్లు భరతుని వెంట శతృఘ్నుడు సేవా భావముతో మెలగినట్లు చూడవచ్చు. శ్రీరామునికి మాత్రము ముగ్గురు తమ్ము లపై ఎనలేని వాత్సల్యము ఉండేడిది.

శ్రీరామచంద్రుని వనవాసమునకు పంపునపుడు లక్ష్మణుడు ఎందుకు వారించలేదని ప్రశించడాన్ని పరిశీలిస్తే అన్నగారి పైనున్న అవ్యాజ ప్రేమ ప్రతిబింబిస్తుంది. లక్ష్మణుడు తండ్రిని ఎందుకు ఎదిరించలేదని అడిగాడు. ఇది శతృఘ్నుని ప్రతిఘటన మనస్తత్వాన్ని తెలియచేస్తుంది.

రామరాజ్యం ఒక అపురూపమైన కాలము యుగయుగాలకు అది ఆదర్శమై నిలిచింది. శ్రీరామచంద్రుడు, భరతునితో కూడి అనేక సేవాకార్యక్రమాలను నిర్వహించేవాడు శతృఘ్నుడు. రామరాజ్యం అద్భుతంగా కొనసాగుతున్న కాలంలో కూడా అసుర బాధలు తప్పలేదు. లవణాసురుడను వాడు ఋషులను, ప్రజల ను అనేక బాధలు పెడుతూ వుండేవాడు. ఒకనాడు ఋషులందరూ రామచంద్రుని సభకు వచ్చి తమ ఇక్కట్లను విన్నవించుకున్నారు. వాడిని వధించడానికి ఎవరిని పంపుదామని సభలో సభికులను ప్రశ్నించాడు శ్రీరామచంద్రుడు. అంత భరతుడు సన్నద్ధుడవ్వగా శతృఘ్నుడు తాను లవణాసురుని అంతమొందించెద నని రాజారామునితో విన్నవించుకున్నాడు. భరతుడు ఇంతవరకు రాజ్యభారము ను మిమ్ములను స్మరించుకొనుచూ భరించి అలసిపోయినాడు. దు:ఖభరితమైన మనసుతో ఇంతకాలము పరిపాలన చేసినాడు. కందమూలములు భుజించుచూ మీరు అయోధ్యకు వచ్చునంతవరకూ సంతోషమునకు దూరమైనాడు. కావున భరతునికి కొంతకాలము విశ్రాంతినివ్వవలెను. లవణాసుర వధకు నేను పోయెద నని శతృఘ్నుడు సభాసదుల సమక్షంలో విన్నవించుకొన్నాడు.

శత్రుఘ్నుని మాట విన్న శ్రీరాముడు ఎంతగానో సంతసించి, సమయోచిత ఆలోచనకు మెచ్చుకున్నాడు. లవణాసురుని అంతమొందించుటకు సిద్ధపడమని ఆదేశించాడు. అలాగే సర్వసమర్థుడవైన నీకు లవణాసురుని అనంతరము అతని మధురా రాజ్యమునకు రాజుగా పట్టాభిషిక్తుని చేయుదునని ప్రకటించాడు. కాని ఆ ప్రకటన విని "రాజా మీ ఆజ్ఞను తప్పక ఆచరిస్తాను. అన్న భరతుడు లవణా సురుని సంహరించుటకు ప్రతిజ్ఞ చేయగా నేను తొందరపడి మధ్యలో కల్పిం

చుకొనుట దోషము. నా పలుకుల వలన మధురారాజ్యమునకు రాజుగా వెళ్ళుట ఒక దుర్గతి. పెద్దవారైన మీరందరూ ఉండగా నాకు పట్టము కట్టి పంపుట ధర్మము కాదు. కావున అన్న భరతుని లవణాసురుని పైకి యుద్ధమునకు పంపి మధురారాజ్యమునకు రాజుగా చేయుమని" పలికినాడు. ఇది శతృఘ్నుని త్యాగ మునకు ఉదాహరణ. శ్రీరామునికి దూరమై రాజ్యము పొందుట ఒక దుర్గతిగా భావించినాడు. చివరకు రామసభ శతృఘ్నుని సమరమునకు పంపుటకు తీర్మా నించినది. శ్రీరాముడు లవణాసురుని చంపుటకు తగిన ఉపాయమును తెలిపెను. అపారమైన సైన్యమును, ధనమును చేకూర్చి శతృఘ్నుని విజయుడవై రమ్మని దీవించి పంపెను.

సైన్యముతో బయలుదేరిన శతృఘ్నుడు మార్గమధ్యమున ఒక రాత్రి వాల్మీకి మహర్షి ఆశ్రమమున బస చేసినాడు. అదేరాత్రి సీతామాతా లవకుశులకు జన్మ నిచ్చింది. తరువాత ఏడు దినములు సైన్యముతో ప్రయాణించి యమునానది తీరమునున్న చ్యవన మహర్షి ఆశ్రమమున బసచేసెను. లవణాసురుని గమనమును, దినచర్యలను మహర్షిని అడిగి తెలుసుకొన్నాడు. అంత చ్యవన మహర్షి అతని దుర్మార్గపు పనులను, ప్రజలు, ఋషులు పడే బాధలను వివరించెను. రావ ణుడి సోదరి కుంభిని కుమారుడు లవణాసురుడు. అతని తండ్రి మధు గొప్ప శివ భక్తుడు. అతని భక్తికి మెచ్చి ఒక మహిమాన్విత త్రిశూలాన్ని ప్రసాదించాడు. అది ప్రస్థుతం లవణాసురుని వద్ద కలదు. అదిచేతిలో ఉండగా లవణాసురుని ఎవరూ జయించలేరు. శతృఘ్నుడు మధురానగరము నుండి వేటకు వెళ్ళి తిరిగి వస్తుం డగా ద్వారము కడ లవణాసురుని అడ్డగించి , రెచ్చగొట్టి అతనితో యుద్ధము చేసి రాముని స్మరించి ఒక దివ్యాస్త్రముతో అతని గుండెలు చీల్చి చంపివేసెను. ఆ సమ యములో త్రిశూలము కోటలోపల ఉండిపోయినది. తరువాత మధురానగర మును పునర్నిర్మించాడు. ఋషులు, ప్రజలకు శాంతిని చేకూర్చి పండ్రెండు సంవ త్సరాలు అచ్చటనే ఉన్నాడు. తిరిగి శ్రీరామచంద్రుని దర్శించుటకు అయోధ్య వస్తూ, వాల్మీకి ఆశ్రమమున బస చేసెను. అదే సమయములో లవకుశులు గానము చేసిన శ్రీరామ చరితమును విని పులకించి పోయాడు. అయోధ్యను చేరి శ్రీరామచంద్రుని ఆదేశముతో తిరిగి మధురాజ్యమునకు పోయి పరిపాలన చేసినాడు.

శ్రీరామచంద్రుడు అవతారము పరిసమాప్తము గావించుకొని సరయూనది ద్వారా పరంధామమును చేరునపుడు శతృఘ్నుడు తన కుమారులైన సుబాహుని మధురారాజ్యమునకు, శత్రుఘాతిని విదిశానగరమునకు పట్టాభిషిక్తులను గావించి అయోధ్య చేరెను. శ్రీరామచంద్రుని అనుమతి తో ఆయన వెంట పరంధామము చేరెను. ●

# కర్మ ఫలం తప్పదు

అందర్నీ హెచ్చరించే మంచి వ్యాసం. అందరూ చదవాలని మనవి.

కర్మఫలం ఎవరికైనా అనుభవించక తప్పదు.

మన పాపకర్మే గ్రహరూపంలో వచ్చి బాధిస్తుంది. ఎందుకంటే? కర్మ బలీయమైనది.

పరీక్షిత్తు మహారాజును కాటు వెయ్యాలని బయల్దేరాడు తక్షకుడు.

కశ్యపుడనే బ్రాహ్మణోత్తముడు గొప్ప మంత్రవేత్త. రాజును సంరక్షింప, రాజ ప్రాసాదానికి బయలుదేరాడు. దారిలో ఇద్దరూ ఒకరికొకరు తారసపడ్డారు.

తక్షకుడు కూడా బ్రహ్మణ వేషధారియై, కశ్యపుని చూసి మహాత్మా! తమరెవరు? ఎచ్చటికీ పయనం? అని అడిగాడు.

ఏదో బీద బ్రాహ్మణుడిని. రాజుగారు ఏనుగెత్తు ఐశ్వర్యం ప్రసాదిస్తానంటే, నా మంత్రమహిమ వినియోగించే అవకాశం వచ్చింది కదా అని సంబరపడుతున్నాను అంటూ దాపరికం లేకుండా అసలు విషయం చెప్పేశాడు.

అమాయక బ్రాహ్మణుడా! పరీక్షిన్మహారాజుని కాటువేయబోయేది ఏదో నీటిపామో, బురద పామో అనుకుంటున్నావా? సర్పరాజు వాసుకితో సమానుడైన ఇంకొక సర్పాధిపుడు తక్షకుడే స్వయంగా అయితేనో? అన్నాడు.

తక్షకుడైనా కానిమ్ము! అతడ్ని మించిన ఆదిశేషుడైనా కానిమ్ము! నా దగ్గర ఉన్నది గారడీవాడి పాముమంత్రమో, విషకీటక మంత్రమో అనుకుంటున్నావా? అని ప్రశ్నించాడు కశ్యపుడు.

అంత గొప్పవాడివా! నేనే ఆ తక్షకుడ్ని అని నిజరూపం చూపించాడు తక్షకుడు.

అంతటా కశ్యపుడు, సర్పరాజా! నీకిదే నా ప్రణతి! దీనితోపాటే నా వినతి కూడా విను! మంత్రాధిష్ఠాన దైవానుగ్రహం వల్ల నువ్వు రాజును కాటువేసినా గాని, దాన్ని విరిచెయ్యగల మంత్రాన్ని అనుష్ఠించిన వాడను! తక్షణం విషహరమంత్రం ప్రయోగించి, ప్రభువును రక్షించి బహుమానం పొందగలను. ఇది నా దృఢవిశ్వాసం అని అన్నాడా కశ్యపుడు.

అపుడా తక్షకుడు, తమ ఆత్మవిశ్వాసం కడు శ్లాఘనీయమే! భూసురోత్తమా! ఈ మర్రి చెట్టునుచూడు! దీని ఊడలు ఏవో, మొదలు ఏదో తెలియరానంత దట్టంగా ఉంది కదా! లెక్కపెట్టడానికి సాధ్యం కానన్ని పక్షులకిది ఆలవాలమై కూడా ఉంది. దీన్ని ఉన్నదున్నట్లుగా బూడిద చెయ్యగల నా విషశక్తి చూడు! అని ఆ చెట్టును కసితీరా కాటువేశాడు తక్షకుడు.

కశ్యపుడు అదంతా చిరునవ్వుతో చూస్తున్నాడు. తక్షకుడు చెప్పినదాంట్లో ఆవగింజంతయినా అబద్ధంలేదు. ఆ మహా విషకీలలకు, చెట్టు నిలువునా మాడి బూడిదైపోవడం కళ్లారా గాంచి, అయింది కదా తక్షకా! ఇప్పుడు చూడు! అని పిడికెడు బూడిదను ఆ భస్మరాశి నుంచి తీసుకుని, అత్యంత శ్రద్ధా భక్తులతో అధిష్ఠాన మంత్రజపం చేసి అభిమంత్రించి ఆ బూడిదను కుప్పపై పోసి జలం సంప్రోక్షించి విడిచినాడు.

చిత్రాతిచిత్రంగా మొత్తం సకల పక్షిగణ సహితంగా ఆ మహావృక్షం ఎప్పటి లాగానే అక్కడ నిలబడింది. అతడు సామాన్యుడు కాడని సర్పరాజుకి అర్థమైంది.

వెంటనే తక్షకుడు ఆయన చేతులు పట్టుకుని మహామంత్రద్రష్టా! తమను తక్కువగా అంచనా వేసినాను, నా అజ్ఞానాన్ని మన్నించండి! తమకు తెలుసో... లేదో, నిజానికి పరీక్షిత్తు శాపరూపాన మృత్యుదేవుని సదనానికి వెళ్లవలసిన విధి ఉంది. లేకుంటే, అంతటి ధర్మమూర్తికి సహజ మరణం సమీపించడం ఇప్పట్లో దుర్లభం. త్వరలో కలిప్రవేశం జరగబోతోంది. అప్పటికి జనమేజయుడు రాజుగా ఉండాలంటే, తక్షణం పరీక్షితుని అంకం పరిసమాప్తం కావాలి! ఇది విధాత కృతమే గాని, పరీక్షిత్తుకు సహజంగా జనించిన వికృతం కానేకాదు.

ఇంతకూ తమకు కావలసింది.... అని తక్షకుడు మాట పూర్తి చేసేలోగా ధనమయ్యా! ధనం! అన్నాడు. అంతేకదా! ఈ విలువైన నాగమణులు తీసుకోండి!



ఇంకా వజ్ర వైఢూర్యాలు మీపరం చేస్తాను అని అప్పటికప్పుడే పాతాళ నిధుల్లోని విలువైనవి కశ్యపునికి బహూకరించి పంపివేసినాడు.

ఇంతవరకూ కథ బాగుంది. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసినది చాలా వున్నది.

మన తలరాత బాగా లేకపోతే సహాయం చేసే వాళ్లు దరిదాపులలో కూడా కనిపించరు.

ఒక వేళ కశ్యపుడు లాంటివాడు బయలుదేరినా వారిని ప్రక్కకు తప్పిస్తుంది కాలం.

అదే మనం చేసుకొన్న పాపం, కర్మఫలం.

పాపకర్మ బలీయంగా వుంటే ఎవ్వరూ సహాయం చేయలేరు, ఆఖరికి భగవంతుడు కూడా.

ఎందుకంటే వాడి కర్మ కలిసిరావాలి.

కౌశికుడు రాజును రక్షించుదామని బయలుదేరినా, పరీక్షిన్మహారాజు యొక్క పాపకర్మ అడ్డు పడినది.

ఏమిటి ఆ పాప కర్మ?

ఒక ముని మీద చచ్చిన పామును వేయడం.

మంచివారితో మహాత్ములతో చెలగాడటం.

కోరి కోరి తన మృత్యువును అహంకారంతో కొని తెచ్చుకొన్నాడు.

రాజు, మునిశాపం వలనో, తక్షకుడి కాటు వలనో చనిపోలేదు, జకేవలం తన కర్మ చేతనే చనిపోయినాడు.

పరీక్షిత్తు మహారాజుకు, గ్రహముల వలన కీడు జరగలేదు. ఇక్కడ తక్షకుడు ఎంత నిమిత్తమాత్రుడో, అదే విధముగా గ్రహములు కూడా! మానవునికి, కర్మ ఫలము నొసగడంలో గ్రహముల యొక్క ప్రమేయం వుంటుంది.

మన పాపములు గ్రహముల రూపములో మనల్ని కర్మఫలం అనుభవింప జేస్తాయి.

నిజానికి ఏ గ్రహమూ మనల్ని ఏమీ చేయదు.

మన పాపకర్మే గ్రహరూపంలో వచ్చి బాధిస్తుంది.

కర్మ బలీ

# శరీరం కర్మలు చేసే ఒక పరికరం

పునర్విత్తం పునర్మిత్రం
పునర్భార్య పునర్మహి
ఏతత్సర్వంపునర్లభ్యం
న శరీరం పునఃపునః

పోయిన ధనం మళ్లీ చేరుతుంది.
దూరమైన మిత్రుడు మళ్లీ చేరువ అవుతాడు.
భార్య గతిస్తే మరొక భార్య లభిస్తుంది.
భూసంపద మళ్లీ ప్రాప్తిస్తుంది.
పోయినవన్నీ మళ్లీ తిరిగి రాబట్టుకోవచ్చు!
కాని మానవ శరీరం మాత్రం మళ్లీ మళ్లీ తిరిగి రాదు.
అందుకే
శరీరం ఖలు ధర్మసాధనం అన్నారు.
కేవలం శరీరం ఉంటేనే ధార్మిక పనులు చేయవచ్చు.
శరీరం ఉంటేనే నాలుగు మంచి పనులు చేసే అవకాశం వస్తుంది.
శరీరం ఉంటేనే హితవాక్యాలు చెప్పవచ్చు.
ఏ పని చేయడానికైనా శరీరం కావాలి.
కనుక శరీరమును రక్షించుకోవాల్సింది మానవ జన్మ ఎత్తినవాళ్లే.
జంతువులకు శరీరం ఉంటుంది, కాని, వాటికి ఆలోచన ఉండదు.

పైగా కొద్దోగొప్పో ఆలోచన కలిగినా దాన్ని అమలు చేయడానికి శరీరం సహకరించదు.

బుద్ధి, ఆలోచన, మాట్లాడే శక్తి, కావలసినది సంపాదించుకొనే జ్ఞానం జతగిన అవయవ నిర్మాణం ఉండేది ఒక్క మనుష్యులకే.

వాటిని అమలు చేసే నైపుణ్యమూ మనుష్యులకే ఉంటుంది.

కనుక మనమందరం శరీరాన్ని కాపాడుకోవాలి.
అతిగా తిన్నా,
అతిగా ఆలోచించినా,
అతిగా సుఖించినా,
అతిగా దుఃఖించినా,
ఏదైనా అతిగా చేస్తే ఈ "శరీరం" కాస్తా పుటుక్కుమంటుంది.
ఇక శరీరం చేజారిపోయాక చేసేది ఏమీ ఉండదు.
కనుక ముందు శరీరమును జాగ్రత్తగా చూసుకోవాలి.

దీనికి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలను పాటించడమే "మహా ఔషధంగా" భావించాలి.

**విస్తరాకు**

విస్తరి ఆకుని ఎంతో శుభ్రంగా ఉంచుకొని నీటితో కడిగి నమస్కారం చేసుకుని భోజనానికి కూర్చుంటారు. భోజనము తినే వరకు ఆకుకు మట్టి అంటకుండా జాగ్రత్త వహిస్తాము. తినిన మరుక్షణం ఆ విస్తరాకును మడిచి, దూరంగా మురికి పెంటపై పడేసి వస్తాము. తర్వాత ఆ ఎంగిలి ఆకును ముట్టుకోము కూడా.

మనిషి జీవితం కూడ అంతే "ఊపిరి" పోగానే ఊరిబయట పారేసి వస్తారు

విస్తరి ఆకు పారేసినప్పుడు సంతోష పడుతుంది, ఎందుకంటే పాయే ముందు ఒకరి ఆకలిని తీర్చటానికి తను ఉపయోగపడినాను అన్న తృప్తి ఆకుకు ఉంటుంది, విస్తరాకుకు ఉన్న "ముందు ఆలోచన", తృప్తి భగవంతుడు మనుషులకు కూడా ఇవ్వాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ !

"సేవ చేసే అవకాశము వచ్చినపుడు సేవ చేయండి" జారవిడుచుకోకూడదు.

మళ్లీ, ఇంకొకసారి, ఎప్పుడో చేయవచ్చు అనుకొని వాయిదా వేయకండి, ఆ అవకాశము మళ్లీ వస్తుందని అనుకుంటే... కుండ ఎప్పుడైనా పగలవచ్చు, అప్పుడు విస్తరికి ఉన్న తృప్తి కూడ మనకి ఉండదు.

ఎంత సంపాదించి ఏమి లాభం?
ఒక్క పైసా కూడా తీసుకుపోగలమా?

మన చేత, మన వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఓ 10 మందికి మంచి జరిగితే, మన ఈ జన్మ సార్థకమయినట్లే...

## ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 28 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? 'వేలు'గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ 'రూక'నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. 'ప్రముఖాంధ్ర'ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | **PRAMUKHANDHRA** |
| Account No | : | **20011102592** |
| Bank | : | **BANK OF MAHARASTRA, T.NAGAR** |
| IFSC Code | : | **MAHB 0000450** |

**ప్రముఖాంధ్ర**
**64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.**
**మొబైల్ : 98400 48941**



# ప్రతీ ఇంట్లో తప్పకుండా ఉండవలసిన చిత్రపటము

### చాగంటి వారి ప్రవచనాల నుండి..

శ్రీరామ పట్టాభిషేకం మూర్తి లేని ఇల్లు ఉండకూడదు. ఉండి తీరాలి. ఎందుచేత అంటే ప్రణవాన్ని పిల్లలు, స్త్రీలు, పలకకూడదు.

కానీ 'ఓం'కారాన్ని తీసుకువచ్చి ఇంట్లో పూజ చేయడానికి తేలిక మార్గం ఏమిటంటే శ్రీరామ పట్టాభిషేకం.

పట్టాభిషేకంలో అందరూ ఉన్నా మనం ఇంట్లో పెట్టుకునే పట్టాభిషేక మూర్తిలో నలుగురే ఉంటారు – సీతారాములు, లక్ష్మణస్వామి, కాళ్ళ దగ్గర హనుమ.

రాముడు అకారానికి ప్రతినిధి,

**యో వేదాదౌ స్వరఃప్రోక్తః! వేదాంతేచ ప్రతిష్ఠితః!**

అకారం విష్ణువు అయితే ఉకార మకారములు లక్ష్మణస్వామి, సీతమ్మ.

'మ్' అనే నాదస్వరూపం వాయుపుత్రుడైన హనుమ.

అకార ఉకార మకార నాద స్వరూపమైనటువంటి హనుమతో కలిపి ఓంకారమే ఇంట్లో సీతారామ చంద్రమూర్తి యొక్క పట్టాభిషేక మూర్తిగా ఉంటుంది.

ఆయనకి పూజ చేయడానికి వాళ్ళు చేయవచ్చా? వీళ్ళు చేయవచ్చా? అని అభ్యంతరం ఉండదు. కాబట్టి ఓంకారానికి పూజ చేయడం ఎంత గొప్పదో పట్టాభిషేకానికి పూజ చేయడం అంత గొప్పది.

రాముడికి ఒక్కడికే రెండు పేర్లు ఉంటాయి. వీర రాఘవ, విజయ రాఘవ. ఆయన ఎప్పుడూ కోదండం చేత్తో పట్టుకుంటాడు. అపజయం అన్నది రాముడికి లేదు. రాముడు ఆర్తత్రాణపరాయణుడు. అటువంటి రాముడు ఇంట్లో ఉంటే నిర్భయత్వం. చెడు చేసేవారు ఇంట్లోకి రాలేరు.

కానీ పూజకు సంబంధించినంత వరకు పంచాయతనంలో సీతారామ చంద్రమూర్తి పట్టాభిషేకమూర్తిని పెట్టుకుని చేయాలి అన్న కోరిక విష్ణువుయందు సమన్వయం చేసుకోవాలి. వేంకటేశ్వరుడు ఉన్నాడు మూర్తిలో. జరామచంద్రమూర్తియే వేంకటేశ్వరుడు.

అన్నమాచార్యుల వారు ఆయన చేతిలో దశావతారాలూ చూశాడు.

అన్నీ వేంకటేశ్వర స్వామివారే. అయినప్పుడు వేంకటేశ్వరుడే రామచంద్రమూర్తి.

మనస్సుతో చూడగలిగినటువంటి శక్తికి ఎదిగి ఉంటే హనుమ ఆయన పాదాల దగ్గర కూర్చున్నట్లు సీతారామలక్ష్మణులు అక్కడ ఉన్నట్లు భావన చేసి వేంకటేశ్వరుడి పాదాల దగ్గర రామచంద్రమూర్తికి సమర్పిస్తున్నట్లు పూజ చేయడం ఉత్కృష్టమైనటువంటి పూజ.

కాదంటే దానికి మార్గం ఏమిటంటే తూర్పు గోడకు పెట్టకుండా దక్షిణానికి తిరిగి మీరు నమస్కారం చేయవలసిన అవసరం రాకుండా రామచంద్రమూర్తి పట్టాభిషేకమూర్తిని ఉంచుకొని ఆ మూర్తి వంక చూసి తులసీ దళాన్ని వేంకటేశ్వరుని పాదాల దగ్గర వేస్తూ ఉండవచ్చు. మీరు ఎవరిని అనుకుని వేస్తారో ఆయనకే పడుతోంది అని భావన చేస్తే చాలు...

సుప్రభాతంలో 'అవనీ తనయా కమనీయకరం' అని సీతమ్మ తల్లి భర్తగా రామచంద్రమూర్తిగానే వేంకటేశ్వరుడికి.

అసలు సుప్రభాతం ప్రారంభం 'కౌసల్యాసుప్రజారామ పూర్వాసంధ్యాప్రవర్తతే! ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్!!'

రాముణ్ణి విశ్వామిత్రుడు ప్రత్యక్షంగా నిద్రలేపాడు. ఆ శ్లోకంతో ప్రారంభం. ఆ రాముడే వేంకటేశ్వరుడిగా లోపల నిలబడి ఉన్నాడు.

ఇప్పటికీ ఆనందనిలయ విమానంలో స్వామివారి ప్రక్కన ఉన్న వేదిక మీద రామచంద్రమూర్తి యొక్క మూర్తి ఉంది. త్రిభంగి స్వరూపంగా కోదండం పట్టుకొని ఉంటాడు. ఊరేగింపుకు బయటికి వస్తూ ఉంటాడు. కాబట్టి వేంకటేశ్వరుడే రాముడు. చూడగలిగి పూజ చేస్తే మంచిది. కాదు మాంసనేత్రంతో కూడా అలా చూసి చేయాలని ఉంది అంటారా తప్పు అనను.

పట్టాభిషేకమూర్తిని ఒక చోట పెట్టుకోండి.

ఆయన వంక చూస్తూ ఈయన పాదాలమీద తులసీదళం వేయండి. సంప్రదాయానికీ భంగం రాదు. మనస్సులో కోరిక తీరడానికీ ఇబ్బంది రాదు. అలా పూజామందిరాన్ని నిర్వహించుకోండి.

**శ్రీ రామ జయ రామ జయ జయ రామ...**






## నటనలో, పాటలో పెట్టనికోట...
## అమృత దార ఒలికించు ఆ నోట...
# సత్యనారాయణ కొచ్చర్లకోట
## గారి వర్ధంతి... వారికిదే మా హారతి...!!

ఆంధ్ర నాటకరంగంలో నటనలో పైకొచ్చినవారూ, పాటతో పైకొచ్చిన వారూ, ఎందరో నటీనటులు ఉన్నారు. అటువంటివారిలో నటనలో, పాటలో మేటి నటులనిపించుకున్నవారు కొచ్చర్లకోట సత్యనారాయణగారు. రామ పాత్రలో అభినవ రాముడనిపించుకున్న ప్రసిద్ధ నటుడు ఈయన.

ముద్దబంతి పువ్వులాంటి ముఖారవిందంతో, ఎర్రగా బొద్దుగా చూపరులను ఇట్టే ఆకర్షించే అంగసౌష్టవం, ముసిముసి నవ్వుతో ముచ్చటగొలిపే ముఖ వర్చస్సు లోని శాంతం, కళ్ళలోని కరుణ, మాటలోని మాధుర్యం, ఉత్తమ వ్యక్తిత్వంతో కూడిన వినయం అన్నీ కలిసి ఆయన రామ పాత్రకు ప్రాణం పోశాయి.

పశ్చిమ గోదావరిజిల్లా ఊనగట్ల గ్రామంలో 2వ తేదీ ఏప్రిల్ నెల 1916 న జమీందారీ కుటుంబంలో జన్మించారు. తరువాత మాతామహులు భీమడోలు చేరడంతో సత్యనారాయణగారి బాల్యమంతా అక్కడే గడిచింది.

సత్యనారాయణగారు ఎనిమిది సంవత్సరాల వయస్సులో గ్రామఫోనువద్ద కూర్చుని, ఆనాటి గంధర్వ గాయకుల పాటలన్నీ వినీ వినడంతోనే పాడగలిగే నేర్పును సంపాదించారు. ఉండేవారు. ఎప్పుడు చూసినా మృదుమధురమైన గానాన్ని ఆలాపిస్తూ ఉండేవారు.

ఆనాటి నాటకరంగం మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఉంది. రంగస్థల నటులకు బ్రహ్మరథం పట్టే రోజులు అవి. ఏవిధంగానైనా రంగస్థలం మీద పాత్రలు ధరించాలనే కుతూహలం కలిగింది కొచ్చర్లకోటకు.

14 సంవత్సరాల వయసులో రాజమండ్రిలో ఫోర్తుఫారమ్ చదువుతూ వున్న రోజులలో వీరి గాన మాధుర్యానికీ, నటనాశక్తికీ అచ్చెరువంది మాచిరాజు రామచంద్రమూర్తి (బండరాముడు) మొదలైనవారు స్థాపించిన కేసరీ నాటక సమాజంలో వీరికి స్థానం లభించింది. ఈ విధంగా నాటకాలలో నటించే అవకాశాన్ని సంపాదించి గలిగారు.

ఆ తరువాత స్వగ్రామమైన భీమడోలులో అనేకమంది ఔత్సాహిక నటులను ఉత్సాహపరచి వారితో ఒక నాటక సమాజాన్ని స్థాపించి భీమడోలు గ్రంథాలయం సహాయార్థం అనేక నాటకాలను ప్రదర్శించారు.

కొంతకాలం తాతముత్తాతల గ్రామమైన కైకరం గ్రామంలో కూడా ఔత్సాహిక నటులను ప్రోత్సహించి ప్రతాపరుద్రీయం మొదలగు నాటకాలకు దర్శకత్వం వహించి పేద ప్రజల సహాయార్థం కొన్ని ప్రదర్శనలను ప్రదర్శించారు.

ఇంతలో టాకీయుగం ప్రారంభమైంది. కొచ్చర్ల కోట సత్యనారాయణగారికి ప్రప్రథమంగా విజయవాడ సరస్వతీ టాకీస్ వారి ద్రౌపదీ వస్త్రాపహరణం చిత్రంలో సహదేవుని పాత్ర వేసే అవకాశం లభించింది. మీర్జాపురం రాజాగారి జయా ఫిలిమ్స్) 'కృష్ణజరాసంధ'లో కృష్ణుడుగా, ఈస్టిండియా కంపెనీవారి సాంఘిక చిత్రం 'వరవిక్రయం'లో బసవరాజుగా, వై.వి.రావు నిర్మించిన 'మళ్ళీ పెళ్ళి' చిత్రంలో రెండవ నాయక పాత్రను, పాదుకాపట్టాభిషేకం'లో లక్ష్మణుని పాత్రను సమర్థవంతంగా నటించారు.

'మళ్ళీ పెళ్ళి' చిత్రంలో 'ప్రణయవతి నాపై కోపమా' అని పాడేపాట, జరాసంధ చిత్రంలో 'బేలతనమేలనే శీలవతి' అని వాడిన పాట అధిక ప్రజాదరణను, ప్రచారాన్ని కూడా పొందాయి.

జరాసంధ పాత్రలో వేమూరి గగ్గయ్యగారి గంభీర పాత్ర గర్జనలకు, కృష్ణ పాత్రలో ఎదురుగా నిలబడి సెహభాష్ అనిపించుకున్న నటులు సత్యనారాయణగారు.

పద్మశ్రీ స్థానం చిత్రాంగి అయితే, కొచ్చర్లకోట సారంగధరుడుగా, స్థానం సత్యభామైతే, ఈయన కృష్ణుడుగా ఆంధ్రదేశంలో అనేక ప్రాంతాలలో నాటకాలను ప్రదర్శించి కీర్తిని గడించుకున్నారు.

ఆ తరువాత ఏలూరులో ప్రభాత్ థియేటర్ స్థాపకులైన బందావారితో కలిసి అనేక భారత నాటకాలలో బందా కృష్ణుడుగా కొచ్చర్లకోట అర్జునుడుగా అనేక నాటకాలను ప్రదర్శించారు.

'బొబ్బిలియుద్ధం'లో వెంగళరావు. సతీసావిత్రిలో సత్యవంతుడు, చింతామణిలో భవానీశంకరుడు, కాళిదాసులో కాళిదాసు పాత్రలను సమర్థవంతంగా నటించి ఉత్తమ నటులుగా, గాయకులుగా పేరు తెచ్చుకున్నారు.


తెనాలి బేతా వెంకటరావు రామాంజనేయ యుద్ధం నాటకం పెద్ద ఎత్తున ప్రదర్శిస్తున్న సమయంలో, సత్యనారాయణగారి రామ పాత్రకూడా ప్రేక్షకుల అధిక ప్రశంసలందుకుంది. శ్రావ్యమైన గాత్రంలో ఒకవంక పద్యాలు అలాపిస్తూ మరో ప్రక్క అమోఘ నటనతో ప్రేక్షకులను తన ప్రక్కకు ఆకట్టుకునేవారు. అన్ని పాత్రలకన్నా అధికకీర్తిని ఆయనకు సంపాదించి పెట్టిన పాత్ర శ్రీరాముని పాత్ర.

ఇంతటి ఉత్తమ నటులైన కొచ్చర్ల కోట సత్యనారాయణగారు 1969 డిసెంబరు 20న ఏలూరులో దివంగతులైనారు.

ఆయన కేవలం నటులుగానే కాక అనేక సంఘ సంస్కరణ కార్యక్రమా పాల్గొన్నారు. పేద విద్యార్థులకు, పేద కుటుంబాలకు సహాయం చేశారు. ఆయన నాటక కళాభివృద్ధికి నాలుగు దశాబ్దాలపాటు నిర్విరామంగా కృషి చేసిన నిరాడంబర వ్యక్తి.

ఆనాటికీ, ఈనాటికీ, ఏనాటికీ ఆయన గాత్రమాధుర్యం ఆ రామ పాత్ర, ఆ కృష్ణ పాత్ర మరువరానివి మరువలేనివి.

(సేకరణ–నూలు)



# పాదాభివందనం వద్దన్న పరమాచార్య!




సుప్రసిద్ధ ప్రవచన కర్త కృపానంద వారియార్ ఓమారు కంచి పరమాచార్య దర్శనం కోసం తన శిష్యులతో కలిసి కంచిలోని శంకర మఠానికి వెళ్ళారు.

కృపానంద శిష్యులు పరమాచార్యవారికి పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు.

అనంతరం భారీకాయులైన వారియార్ పరమాచార్యకు పాదాభివందనం చేయడానికి ప్రయత్నించారు.

అయితే పరమాచార్య "సౌంజ్ఞ" చేస్తూ ఆయనను కష్టపడి పాదాభివందనం చేయవద్దని వారించారు.

అందుకు వారియార్ మానసికంగా ఎంతో బాధపడ్డారు. అంతేకాదు, ఆయన శిష్యులూ పరమాచార్య చర్య అర్థంకాక కంగుతిన్నారు.

ఆందరూ వెళ్ళిపోయాక వారియార్ పరమాచార్యతో "స్వామీ! మీకు పాదాభివందనం చేద్దామనుకున్న నాకెందుకా భాగ్యం కల్గించలేదు" అని బాధపడ్డారు.

అప్పుడు పరమాచార్య "మీరు మెడలో ఎన్నో రుద్రాక్ష మాలలు వేసుకున్నారు. కొన్ని రుద్రాక్షలలో శివలింగం ఉండటం గ్రహించాను. మీరు పాదాభివఃదనం చేస్తున్నప్పుడు శివలింగాలూ భూమిని తాకి అవి నన్ను నమస్కరిస్తున్నట్లవుతాయి. అది సరికాదు. అయినా నా ఆశీస్సులు మీకెప్పుడూ ఉంటాయి"

పరమాచార్య జవాబు విన్నాక వారియార్ కళ్ళు చెమ్మగిల్లాయి. అంతేకాదు ఆరోజు నుంచి భూమీద పడి నమస్కరించే అలవాటును ఆయన మానుకున్నారు.

1966లో వారియారుకి ఆయన భక్తులు భారీ ఎత్తున ఓ సన్మానకార్యక్రమం చేద్దామనుకున్నారు. కానీ ఆయన వద్దని సున్నితంగా తిరస్కరిస్తూ ఆ పేరిట డబ్బులు వసూలు చేస్తారు. కనుక అది తనకిష్టం లేదని అన్నారు.

సంగీతం, పురాణాల గురించి ఉపన్యాసాలివ్వడంలో ఆయన తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకున్నారు. ఓ రోజు ఆయన తండ్రి మల్లయ్య దాసర్ కారణాంతరాలవల్ల ఉపన్యసించడానికి వెళ్ళలేకపోయారు. అప్పుడు ఆయన తన కుమారుడైన కృపానందవారియారుని ఉపన్యసించమని పంపారు. వారియారుని చూసి కార్యక్రమ నిర్వాహకులు విస్తుపోయారు. అయితే ఆయన ప్రసంగాన్ని విన్నవారందరూ ఆశ్చర్యపోయారు. "అంత చిన్న వయసులో ఇంత అనుభవమా?" అని ఆయనను కొనియాడారు.

అలా పద్దెనిమిది ఏట ఉపన్యసించడానికి శ్రీకారం చుట్టిన వారియార్ జీవితాంతమూ దేశమంతా పర్యటించి ప్రవచనాలు చేసారు.

నిరక్షరాస్యులుసైతం సులభంగా అర్థం చేసుకునేలా ఎంతో సరళంగా పౌరాణిక కథలు చెప్పిన వారియార్ 1906 ఆగస్టు 25న జన్మించి 1993 నవంబర్ 7వ తేదీన పరమపదించారు.

– యామిజాల జగదీశ్

## శ్రీమాత్రేనమః

**"వ్యవసాయో వ్యవస్థానః, సంస్థానో స్థానదో ధృవః".**

శ్రీవిష్ణుసహస్రనామాల్లో ఈ నామాలు వస్తాయి. "వ్యవసాయః" అంటే "మానవాళి అభ్యున్నతికి కృషి చేసేవారు" అని భాష్యం చెప్పారు ఆదిశంకరాచార్యులు. ఎంతటి అద్భుతమైన నామం.

పంటలు పండించడాన్ని వ్యవసాయమని, పండించేవారిని వ్యవసాయదారులని ఎంత అద్భుతమైన పేర్లు పెట్టుకున్నాం. ఉదయంలేస్తే రాత్రి పడుకునేవరకూ ఎంతటి కోటీశ్వరుడికైనా వ్యవసాయదారుడే దిక్కు. ఏపని చెయ్యాలన్నా శక్తి కావాలికదా.

అధర్వవేదంలో ఓ మంత్రం ఉంది. దాని అర్థం "నాగళ్ళతో దున్నాలి, విత్తులు నాటాలి, కంకులు పండాలి" అని. ఎలా పండాలంటే "బరువుతో కంకులు వంగిపోవాలి" అని కూడా చెప్పింది వేదం.

రుద్రచమకంలో "అన్నంచ మే, అక్షుశ్చ మే, వ్రీహయశ్చ మే, యవాశ్చ మే, మాషశ్చ మే, తిలాశ్చ మే, ముద్గాశ్చ మే, ఖల్వాశ్చమే గోధూమాశ్చ మే...." – అంటే వరి, మినుములు, నువ్వులు, గోధుమలు ప్రసాదించుస్వామీ అని. ఇంకోచోట "ఓషధశ్చ మే, కృష్టపచ్యంచ మే, అకృష్టపచ్యంచ మే" అంటే ఓషధులు – దున్ని పండించేవీ, దున్నకుండా వర్షాధారంతో పండేవీ రెండింటినీ – ఇయ్యి స్వామీ అని.

మహాభారతం అంటే జూదం, వస్త్రాపహరణం, యుద్ధమే అనుకుంటారు. ఎన్నో సంవాదాలు, పిట్టకథలద్వారా ఎన్నో అద్భుతమైన విషయాలు చెప్పారు వ్యాసర్షి. శాంతిపర్వంలో భృగుమహర్షి భరద్వాజమహర్షి ల సంవాదం ఉంది. అది వృక్షాలకు సంబంధించినది. అది తెలియచేస్తున్నదేమిటంటే వృక్షాలకు "స్పందన, స్పర్శ, దృశ్యం, వినికిడి" లాంటివన్నీ ఉన్నాయి అని. ఇదేవిషయాన్ని మన ' జగదీష్ చంద్రబోస్" శాస్త్రీయంగా నిరూపించారు.

వివేకానందుడు అంటారు " మన ఋషులు తమ తపోశ్శక్తితో అంతర్ముఖులై ప్రకృతిని బాధించకుండా చెప్పిన విజ్ఞానాన్ని నేడు శాస్త్రజ్ఞులు బహిర్ముఖులై ప్రకృతిని బాధిస్తూ నిరూపించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు " అని. ఎంత అద్భుత విషయం.

మన " ఋషులజ్ఞానానికి, సనాతనధర్మానికి " సాటి ఏదీ లేదు, ఉండబోదు/ రాబోదు.



# శ్రీ ఆంధ్ర కళా స్రవంతి విశిష్ట సేవలు



సామాజిక, ఆధ్యాత్మిక రంగాలలో శ్రీ ఆంధ్ర కళాస్రవంతి విశిష్ట సేవలందిస్తోంది. ఈ సంస్థ 1985 జనవరి ఒకటవ తేదీన స్థాపించబడింది. ఎంఎస్ మూర్తి మొట్టమొదటి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1985 జనవరి 14వ తేదీ నుంచి అనేక సాంఘిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు రూపొందించి చక్కగా నిర్వహిస్తున్నారు. 22 మార్చి 1985 ఉగాది రోజున జెవై ఆచార్యులు జై గోపాల్ గరోడియా వివేకానంద విద్యాలయంలో సంఘ కార్యక్రమాలను ప్రప్రథమంగా ప్రారంభించారు. సంఘ నిర్వాహకులుగా ఎందరో పనిచేయగా ప్రస్తుతం జెయం నాయుడు కార్యదర్శిగా ఉన్నారు. చెన్నైలోని అన్నానగర్ పరిసర ప్రాంత తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, తెలుగు భాష అభివృద్ధిని కాంక్షించి ఈ సంఘం స్థాపించబడింది. అనేక తెలుగు కుటుంబాలు ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ సంఘానికి చేదోడు వాదోడుగా ఉంటున్నాయి. ఇందులో ప్రవాస భారతీయులు సహా స్థితిమంతులు సభ్యులుగా ఉన్నారు. కళా వాచస్పతి కొంగర జగ్గయ్య మార్చి 2004 వరకు అధ్యక్షులుగా నుండి చివరి శ్వాస వరకు సంఘానికి ఎంతగానో సేవలందించారు. ఈ సంఘం ద్వారా ఉగాది, శ్రీరామనవమి లలిత సహస్ర నామపూజ తదితర దైవ కార్యాలను జరుపుతున్నారు. ప్రతి వారము అన్నదాన కార్యక్రమం జరుపుతున్నారు. అలాగే పేద ప్రజల కోసం విహార యాత్రలు, సంక్రాంతి సంబరాలు, ఆరోగ్య శిబిరాలు తదితర కార్యక్రమాలు జరుపుతున్నారు. భూకంపాలు, తుపానులు, వరద బాధిత ప్రజలకు సహాయ సహకారాలను అందిస్తున్నారు. తెలుగు సినిమా ప్రదర్శనలు, చదువులో రాణిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రశంస వేతనాలను అందిస్తున్నారు. అలాగే అంగ వికలాంగులు, అంధులకు కావలసిన పరికరాలను అందజేస్తున్నారు. తెలుగు విద్వత్కవులు, తెలుగు భాష నిపుణులు, తెలుగు భాష సేవకులను గౌరవించి సన్మాన సత్కారాలను అందజేస్తున్నారు. అంతేకాకుండా, ఇతర రంగాలలో సేవ నైపుణ్యాలను ప్రదర్శించిన వారిని సత్కరించడం జరుగుతోంది. అనేకమంది దాతల సహాయ సహకారాలతో కొరట్టూరు అగ్రహారంలో 3.85 చదరపు అడుగుల ఖాళీ స్థలాన్ని కొని ప్రజాపయోగ ప్రణాళికలు రూపొందించారు. కోదండ రామాలయం, సీతారామ కళ్యాణ మండపం, రెండంతస్తుల విశాల సుందర గదులు, భోజనశాల, అతిథి గృహము, కార్యాలయము నిర్మించారు. భక్తుల క్షేమార్థం రోజు నిత్య పూజలు జరుగుతున్నాయి. 30 మార్చి 2004న కంచి కామకోటి పీఠాధిపతి పూజారి బ్రహ్మశ్రీ చంద్రభట్ల చింతామణి గణపతి శాస్త్రి ఆలయంలోని అన్ని విగ్రహాలను ప్రతిష్టించి కుంభాభిషేకం జరిపించారు. 9 ఏప్రిల్ 25 న ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక న్యాయశాఖామాత్యులు కొణిజేటి రోశయ్య తమ స్వహస్తాలతో శ్రీ సీతారామ కళ్యాణ మంటపమును ప్రారంభించారు. అందులో 250 మంది కూర్చుని భోజనం చేసే విధంగా భోజనశాల ఏర్పాటయింది. శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వినాయక స్వామి పెద్ద విగ్రహములు ప్రతిష్టింపజేసి 9 మే 2011న కుంభాభిషేకాలను నిర్వహించాము. తెలుగు ప్రజలకు ఈ మేరకు సేవ చేయడం దాతలు శ్రేయోభిలాషులైన కార్యవర్గ సభ్యులు, కార్యదర్శుల సహకారం ఉంది. త్వరలో ఒక వృద్ధాశ్రమం స్థాపించాలన్న సదుద్దేశం ఉంది. చలన చిత్ర పరిశ్రమకు చెందిన వారిని ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ గొప్ప గొప్ప అధికారులు గొప్ప ప్రతిభావంతులు, వైద్యులు, సంగీత విద్వాంసులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, మంత్రులు, అగ్రశ్రేణి పత్రిక విలేకరులు న్యాయ మూర్తులు మొదలైన వారిని నాటి నుంచి సత్కరించుకుంటున్నాము.







### నూతన కార్యవర్గం ఎంపిక

శ్రీ ఆంధ్ర కళా స్రవంతి 2023-26 సంవత్సరాలకు నూతన కార్యవర్గం ఎంపికైంది. ఇటీవల కోదండ రామాలయం కమ్యూనిటీ హాలులో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం అధ్యక్షులు జేయం నాయుడు అధ్యక్షతన జరిగింది. సలహాదారులు ఎంఎస్ మూర్తి స్రవంతి 2023-26 సంవత్సరం కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. కమిటీ అధ్యక్షుడిగా జేయం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ట్రెజరర్ గా జీవి రమణ ఎంపికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా వివిఎన్ హరినాథ్, కేవీఎన్ సురేష్ బాబు, పి. సరస్వతి, సంయుక్త కార్యదర్శులుగా కేఎం దామోదరం, సిహెచ్ సాంబశివరావు, జే సురేష్ బాబు నియమితులయ్యారు. కమిటీ సభ్యులుగా ఓ మనోహరన్, సురేంద్ర కుమార్, సేగు, ఈ. కుమార్, ఈ. బాలాజీ, ఎం శివశంకర నాయుడు, బిఎస్ఆర్ ప్రసాద్, పి పి లోకనాథన్, ఆలయ కమిటీకి బి రాజేంద్రన్, డాక్టర్ వి ఎస్ శర్మ, కెవి.గోపాలకృష్ణ, ఎం.కాశీ విశ్వనాథం, పోకల కల్పన ఎంపికయ్యారు. ఇక మహిళా విభాగంలో ఎం శేషారత్నం, జే అన్నపూర్ణ, జే రాధిక ఎంపికయ్యారు. సమావేశం అనంతరం నూతన కమిటీ నిర్వాహకులు సీతారాముల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రమాణం స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం



'అన్నం' గురించి నలుగురు గొప్ప మనుషులు చెప్పిన నాలుగు మంచి మాటలు.

1. ఆకలిగొన్నవాడికి 'దేవుడు' కనపడేది అన్నం రూపంలోనే ! (మహాత్మా గాంధీ).
2. "నేను వంటింట్లోకి వేరే పనిమీదవెళ్ళినాకూడా, వంట చేస్తున్న మా అమ్మగారు. "పెట్టేస్తా నాన్నా ఒక్క అయిదు నిముషాలు" అనేవారు నొచ్చుకుంటూ– నేను అన్నం కోసం వచ్చాననుకుని! ఎంతయినా అమ్మ అంటే అన్నం. అన్నం అంటే అమ్మ ! అంతే ! (జంధ్యాలగారు).
3. మంచి భోజనం లేని పెళ్ళికి వెళ్ళటం – సంతాపసభకి వెళ్ళినదానితో సమానం! (విశ్వనాధ సత్యనారాయణ గారు).
4. రాళ్లు తిని అరిగించుకోగల వయసులో వున్నప్పుడు తినటానికి మరమరాలు కూడా దొరకలేదు! వజ్రాలూ, వైడూర్యాలూ పోగేసుకున్న ఈ వయసులో మరమరాలు కూడా అరగట్లేదు! అదే విధి! (రేలంగి వెంకట్రామయ్య గారు).
5. ఆరురోజుల పస్తులవాడి ఆకలి కన్నా, మూడురోజుల పస్తులవాడి ఆకలి మరీ ప్రమాదం! ఆహారం దొరికినప్పుడు ముందు వాడ్నే తిననివ్వాలి! (ముళ్ళపూడి వెంకటరమణ గారు).
6. ఏటా వందబస్తాల బియ్యం మాకు ఇంటికి వచ్చినా మా తండ్రిగారు "అన్నీ మనవికావు నాయనా " అని బీదసాదలకి చేటలతో పంచేసే వారు. అన్నీ మనవికావు అనటంలో వున్న వేదార్థం నాకు పెద్దయితేనేగానీ అర్థం కాలేదు! (ఆత్రేయ గారు)
7. అమ్మకి నేను అన్నం పెడుతున్నాను అనటం మూర్ఖత్వం! అమ్మ చేతి అన్నం తింటున్నాను అని చెప్పగలిగినవాడు ధన్యుడు ! (చాగంటి కోటేశ్వరరావు గారు).
8. ఆకలితో వున్న వాని మాటలకు ఆగ్రహించవద్దు !! (గౌతమ బుద్ధుడు).
9. ఆత్మీయులతో కలసి తినే భోజనానికి రుచి ఎక్కువ ! చారుకూడా అమృతంలా రుచిస్తుంది ! (మాతా అమృతానందమయి).
10. మీ పిల్లలు ఎంతదూరంలో, ఎక్కడవున్నా, వేళపట్టున ఇంత అన్నం తిన గలుగుతున్నారంటే అది వాళ్ళ గొప్పాకాదూ, మీ గొప్పాకాదు మీ పూర్వీకుల పుణ్యఫలమే అని గుర్తించు.

# శోభకృత్ లో చిన్ని చిన్ని ఆశ

గత మూడేళ్ళుగా ప్రపంచం మొత్తం అతలాకుతలమైపోయింది. తల్లకిందు లయ్యింది. మనిషిని మనిషి కలవడానికి భయం, సంకోచం. ఎప్పుడొస్తారు అని అడిగినవారు లేరు. అందరం ఒక భయానక వాతావరణానికి గురయ్యాం. మందే లేని ఒక వింత వ్యాధి.

నేను మేధావిని, నాకే అంతా తెలుసు, నాకంటే మొనగాడు లేడన్నవారు కనిపించకుండా పోయారు. ఈ మూడేళ్ళలో కాస్తన్నా తన ప్రజలను పట్టించుకున్న దేశం ఏదన్నా వుందంటే అది నా భారతదేశమే.

అగ్ర రాజ్యాలకన్నా ఎంతో మెరుగు. వికారి నామ సంవత్సరం లో వికారాన్ని చూపుతూ ప్రారంభమైన కరోనా, శార్వరి నామ సంవత్సరంలో మొత్తం ప్రపంచాన్నే చీకటి మయం చేసేసింది. ప్లవ నామ సంవత్సరంలోను తేరుకోలేకపోయాము. శుభకృత్ కాస్త శుభ సూచికలతో ప్రారంభమయ్యింది. మెల్లిగా ప్రజలు దైనందిన జీవితానికి అలవాటు పడడం ప్రారంభమయ్యింది. భయాలు తగ్గాయి. శోభకృత్ అభయమిస్తుందనే ఆశలు చిగురించాయి. ఇన్ని జరుగుతున్నా "ప్రముఖాంధ్ర" తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనేవుంది. ఎక్కడ ఎప్పుడు ఆగలేదు. నాన్న కిచ్చిన మాట తప్పలేదు. ఈ కరోనా సమయంలో ఎవరిని నేనెళ్ళి కలవలేదు. వారే స్థితిలో వున్నారో, వారికేవి ఇబ్బందులున్నాయో అనుకుంటూ వుండిపోయాను. పత్రిక తీసుకురావడం ఒక సవాలుగా మారింది. ఈ మూడేళ్ళలో నన్ను కుటుంబాన్ని కాపాడుకుంటూ, పట్టుదలతో ప్రయాణించగలిగానంటే కారణం నాన్న ఆశీస్సులు కొందరు వధాన్యులు, శ్రేయోభిలాషులు, మిత్రులు పెద్దలు అందించిన సహాయ సహకారాలు మరువలేనివి.

ప్రముఖాంధ్ర కోసం రాలేదేవి అంటూ డాక్టర్ ఇందిరదత్, గోపురం కుంకుం హరికృష్ణ, అజంతా శంకరరావు, జె కె రెడ్డి, కిషోర్ గుప్త, మీనా బిస్కట్స్ సాయిరాం ఇంకా కొంతమంది నాన్నగారి అభిమానులు, చందాదారులు కొంత మొత్తాన్ని అందించారు. వారందరికి నా కృతజ్ఞతలు. వారి సహాయం సహకారం మేమున్నామనే భరోసా పత్రికను తీసుకురావటానికి నాకు కొంత ఊరట, కొత్త ఉత్సాహాన్నిచ్చింది. కాని ఎప్పుడు వచ్చే ప్రకటనలు కొన్ని రాలేదు. వారిని నేను కలవాలని ప్రయత్నించినా అటువైపునుండి స్పందనలేదు.

ప్రముఖాంధ్ర ప్రింట్ వెర్షనే కాకుండా, ఈ మధ్య pdf వెర్షన్ చాల గ్రూపులకు, కొంతమంది కొత్తగా పరిచయమయ్యిన కొత్త వ్యక్తులకు పంపిస్తున్నాం. రెస్పాన్స్ బాగుంది. పాతవారికందరికి ప్రింట్ వెర్షన్ వెడుతూనే వుంది. ఎవరన్నా రాలేదు అని అన్నారంటే కారణం చిరునామా మార్పు తెలియపరచకపోవటమే అయ్యుంటుంది.

పత్రిక నడపటం అంత తేలికైన పని కాదు. పైగా గత ఒక సంవత్సర కాలంలో కాగితం ధర రెండువందల శాతం పెరిగింది, అంతేకాదు ఇంక్ ప్లేట్ రవణా చార్జులు ముప్పై శాతం పెరిగాయి. పైగా ప్రముఖాంధ్ర కంటెంట్ వ్యాపారాత్మకం కాదు, కాని విలువైన సలక్షణమైన సాంప్రదాయ సాహిత్య ఆధ్యాత్మిక విలువల పత్రిక. కంటెంట్ విషయంలో రాజీ పడకుండా నా శాయశక్తుల నా వంతు కృషి చేస్తూనేవున్నాను. నాకు మీ చేయూత సహాయం సహకారం కావాలి. ప్రముఖాంధ్ర పాఠకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ముందుండి నను నడిపిస్తూ ఒక మంచి పత్రికకు మీవంతు సహాయం తప్పక అందిస్తారని ఆశిస్తూ, చిన్న ఆశతో ఎదురు చూస్తూ –

మీ

గోటేటి వెంకటేశ్వరరావు

# తెలుగు భాషను మన ఇళ్లలోనే వాడటం మానేశామా?

డోర్ లాక్ చెయ్యకండి,

నేను వెళ్తున్నా డోర్ లాక్ చేస్కో',

'నా కార్ కీస్ ఎక్కడ?'

ఇందులో 'డోర్' 'లాక్', 'కీస్' కు అచ్చ తెలుగు పదాలు వాడొచ్చు. కానీ మనం వాడం.

ఎందుకు ?

ఓ ముప్ఫై యేళ్ళు వెనక్కి వెళితే,

తలుపు తాళం వేసుకో, గడియ పెట్టుకో అనే వాళ్ళం.

ఇవేకాదు, చిన్నతనంలో విన్న, వాడిన తెలుగు మాటలు మనవే మర్చిపోతున్నాం.

??????

నిన్న మొన్నటి వరకు మనం మాట్లాడిన మాటలు మన పిల్లలకు నేర్పించాల్సింది పోయి, మనమిలా ఎందుకు మారిపోయాం?

మన తెలుగులో మాటలు లేవా?

ఎందుకు లేవు, భేషుగ్గా ఉన్నాయి!

కానీ మనం పలకం.

వంటింటిని కిచెన్ చేసాం.

వసారా.. .వరండాగా మారింది.

ఇలా చావడి, పం?, ముంగిలి, నట్టిల్లు, తలవాకిలి, నడవ, పెరడు, ఇవన్నీ మరచిపోయాం.

మన ఇళ్ళ కు చుట్టాలు, బంధువులు రావడం మానేసారు. గెస్ట్ లే వస్తారు.

ఆ వచ్చిన వాళ్ళు మనింట్లో అన్నం తినరు. ఏ లంచో, డిన్నరో చేస్తారు.

భోజనానికి కూర్చున్నాక కంచాలు పెట్టటం మానేసి ప్లేట్లు పెడుతున్నాం.

అందులో వడ్డించే వన్నీ%లలలల.

రైస్, కర్రీ, గ్రేవీ, ఫ్రై వగైరాలే.

అన్నం, కూర, ఇగురు, పులుసు, వేపుడు, తినండి అంటే, ఇంకేమన్నా ఉందా, వాళ్ళేమనుకుంటారో అని భయం.

అంగడి (కొట్టు) కి వెళ్ళేటప్పుడు సంచి తీసుకెళ్ళం. బ్యాగ్ పట్టుకుని షాప్‌కు వెళ్తున్నాము.

అందులో వెజిటబుల్స్, ఫ్రూట్స్ వేసుకుంటాము. కూరగాయలు, పళ్ళు కుళ్ళిపోయున్నాయి గదా మరి.

ఏమండీ మీ మనవరాలికి కానుపు అయ్యిందా అని ఆ మధ్య ఓ పెద్దావిడను అడిగా. ఏంటమ్మా డెలివరీ అయిందా అనకుండా నువ్వింకా కానుపు అంటావేంటి? అని ఎదురు ప్రశ్న వేసింది. బిత్తరపోవడం నావంతయింది.

టీ.వీ లో వచ్చే ఆరోగ్య కార్యక్రమాలు,

వంటా-వార్పు కార్యక్రమాలు రోజూ చూసే వాళ్ళకు అలవోకగా ఆంగ్ల పదాలు పట్టుబడతాయి మరి.

అందుకే ఆవిడ అలా అని ఉండొచ్చు.

తెలుగు టీ.వీ వంటల కార్యక్రమం లో ఒకావిడ మన కు వంటకం ఎలా చెయ్యాలో చెబుతుంది.

అది ఏ భాషో మీరే చెప్పండి.

'కొంచెం సాల్ట్, మిర్చీపౌడర్, ధనియాపౌడర్, జింజర్ గార్లిక్ పేస్ట్ యాడ్?చేసి ఫైవ్ మినిట్స్ కుక్ చెయ్యలి, స్టౌవ్ ఆఫ్? చేసి మసాలా పౌడర్ యాడ్ చేసి బాగా మిక్స్ చెయ్యాలి.'

ఇలా సాగుతుంది.

మరి మన కూరలకు అల్లం, వెల్లుల్లి, ఉప్పు, కారాల రుచులు ఎలా తగుల్తాయి?

నిన్న మా పక్కింటాయన వచ్చి

'మా సిస్టర్స్ సన్ ది మేరేజ్ ఉందండి, ఊరికి వెళ్తున్నాం, ఇల్లు కాస్త చూస్తుండండి' అని చెప్పి వెళ్ళాడు.

మేనల్లుడి పెళ్ళి అనడంలో ఎంత దగ్గరితనం ఉంటుంది? ఎందుకిలా ముచ్చటైన పదాల్ని వాడటానికి కూడ మనం వెనుకాడుతున్నాం?

అమ్మ, నాన్న అని పిలవడం ఎప్పుడో మానేసాం. అత్త, మామ, బాబాయ్, పిన్ని, పెద్దమ్మ, పెదనాన్న అందరూ పోయి ఆంటీ అంకుల్ మిగిలారు. ఇప్పుడు అక్క, అన్నా, బావ, మరిది, వదిన, మరదలు వగైరాలంతా దూరమై కజిన్స్ అయిపోయారు.

పిల్లల్ని 'బడికి' పంపడం కూడ మానేసాం. స్కూల్?కు పంపిస్తాం.

సరే బడికి వెళ్ళాక వాళ్ళకు ఎలాగూ ఇంగ్లీషు లో మాట్లాడక తప్పదు.

ఇంటి దగ్గరన్నా తెలుగు మాటలు మాట్లాడాలని అనుకోము.

మనం ఎందుకు నిన్నటి వరకు వాడిన తెలుగు మాటలను వదిలేస్తున్నాం ?

ఎక్కువ ఇంగ్లీషు పదాలు వాడితే మనకు సమాజంలో గౌరవం లభిస్తుంది అనుకుంటున్నామా?

తెలుగు మాటలు మనకు మొరటుగా ఎందుకనిపిస్తున్నాయి?

ఇది పరభాషా వ్యామోహం మాత్రమేనా.. ఇంకా ఏమైనాన..

ఒక్క తెలుగు వాళ్ళకే ఇంత వ్యామోహం..

ఇద్దరు తెలుగు వాళ్ళు మాట్లాడుకుంటుంటే పక్కనున్న ఏ పరాయి బాషా వాడికో మొత్తం అర్థం అయిపోతుంది..

ఎందుకంటే మన మాటలలో 90 వంతు ఇంగ్లీష్ పదాలే..

అదే ఏ తమిళులో, మలయాళీలో కన్నడిగులో, మరాఠీలో, మాట్లాడుకుంటే వేరే వాళ్ళకి ఏమి అర్థం అవదు....??

అందుకే మన తెలుగు భాషకు దిక్కులు లేకుండా పోయాయి. ??????

ఇప్పుడు మాత్రం పల్లెలు పట్టణాలు అనే తేడా లేకుండా అందరికీ ఇంగ్లీష్ మాటలు బాగా వంటపట్టాయి.

అలాగని వాడుకలో ఉన్నమాటలను వదిలేసి పరభాషా పదాలు వాడటం వల్ల భాష క్షీణించి పోతుంది.

బయటకెళితే ఎలాగు తప్పదు అనుకున్నా, కనీసం ఇంటి గోడల నడుమైనా ఆపని చేద్దాం.

అవసరం లేని ఆంగ్ల పదాలకు డోర్ లాక్ చేసి, అచ్చ తెలుగు మాటలకు తలుపులు తెరుద్దాం.

అర్థం చేసుకోండి మన తెలుగు ప్రజలారా...

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS



Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225



# మజ్జిగ - మహా పానీయం

అబ్బబ్బా ఎండ మండిపోతోంది కాస్త మజ్జిగిస్తావా అని అడిగా శ్రీమతిని. అన్నం తినెయ్యకూడదా, మజ్జిగతో కడుపు నిండిపోతే అన్నం తినలేరు పైగా ఈరోజు మామిడికాయ పప్పు, కొత్తావకాయ, గుమ్మడి వడియాలు, ముక్కల పులుసు అంటూ నోరూరించింది, కాస్త ఒక పది నిమిషాలుండి తింటా ఈ లోపుగా ఓ గ్లాసెడు మజ్జిగ పట్రా అన్నాను. నాకొచ్చిన ఒక తమాషా మజ్జిగ కథను మీతో పంచుకోవాలనిపించింది.

ఇదిగో ఆ కథ.

"మంచుకొండల్లో పాలు తోడుకోవు. అందుకని, అక్కడ పెరుగుగానీ, దాన్ని చిలికిన మజ్జిగ గానీ దొరికే అవకాశలు ఉండవు. ఈ కారణంగా, కైలాసంలో ఉండే పరమ శివుడికి, మజ్జిగ తాగే అలవాటు లేకపోవటాన ఆయన నీలకంఠు దయ్యాడు."

"పాల సముద్రంలో నివసించే విష్ణుమూర్తికి మజ్జిగ ఎటు తిరిగీ దొరకవు కాబట్టే, ఆయన నల్లని వాడయ్యాడు."

"స్వర్గంలో 'సుర' తప్ప మజ్జిగ దొరకవు కాబట్టి, ఇంద్రుడు బలహీనుడు అయ్యాడు."

"మజ్జిగతాగే అలవాటే గనక ఉంటే, చంద్రుడుకి క్షయ వ్యాధి, వినాయకుడికి పెద్ద పొట్ట, కుబేరుడికి కుష్టురోగం, అగ్నికి కాల్చే గుణం ఇవన్నీ వచ్చేవే కాదు"

'యోగ రత్నాకరం' అనే వైద్యగ్రంథంలో ఈ 'చమత్కార విశ్లేషణ' కనిపిస్తుది.

మజ్జిగ తాగేవాడికి ఏ వ్యాధులూ కలగవనీ, వచ్చిన వ్యాధులు తగ్గి, తిరిగి తలెత్తకుండా ఉంటాయనీ, "విషదోషాలు", "దుర్బలత్వం", "చర్మరోగాలు", "క్షయ", "కొవ్వు", "అమిత వేడి" తగ్గిపోతాయనీ, శరీరానికి మంచి వర్చస్సు కలుగుతుందనీ దీని భావం. అక్కడ దేవతల కోసం అమృతాన్నీ, ఇక్కడ మానవుల కోసం మజ్జిగనీ భగవంతుడు సృష్టించాడట!

వేసవి కాలాన్ని మనం మజ్జిగతోనే ఎక్కువగా గడిపేందుకు ప్రయత్నించాలి. తోడుపెట్టినందు వలన పాలలో ఉండే పోషక విలువలన్నీ మజ్జిగలోనూ పదిలంగా ఉండటంతో పాటు, అదనంగా "లాక్టో బాసిల్లై" అనే "మంచి బాక్టీరియా" మనకు దొరుకుతుంది. పాలలో ఈ ఉపయోగకారక బాక్టీరియా ఉండదు.

అందుకని, వయసు పెరుగు తున్నకొద్దీ మజ్జిగ అవసరం పెరుగుతుంది. ఫ్రిజ్జులో పెడితే మజ్జిగలోని ఈ బాక్టీరియా నిరర్థకం అవుతుంది. అందుకని అతి చల్లని మజ్జిగ తాగకూడదు.

చిలికినందువలన మజ్జిగకు తేలికగా అరిగే గుణం వస్తుంది. అందుకని పెరుగుకన్నా మజ్జిగ మంచిది.

వేసవి కోసం ప్రత్యేకం "కూర్చిక పానీయ"

ఒక గ్లాసు పాలు తీసుకొని, కాచి చల్లార్చి అందులో రెండుగ్లాసుల పుల్లని మజ్జిగ కలపండి. ఈ పానీయాన్ని 'కూర్చిక' అంటారు. ఇందులో "పంచదార" గానీ, "ఉప్పు" గానీ కలపకుండానే తాగవచ్చు. "ధనియాలు", "జీలకర్ర", "శొంఠి" ఈ మూడింటినీ 100 గ్రాముల చొప్పున దేనికదే మెత్తగా దంచి, మూడింటినీ కలిపి తగినంత "ఉప్పు" కూడా చేర్చి, దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోండి. "కూర్చిక"ను తాగినప్పుడల్లా, అందులో దీన్ని ఒక చెంచా మోతాదులో కలిపి తాగండి. వడదెబ్బ కొట్టదు. పేగులకు బలాన్నిస్తుంది. జీర్ణకోశ వ్యాధులన్నింటికీ ఇది మేలు చేస్తుంది. వేసవిలో కలిగే జలుబుని నివారిస్తుంది.

జవడదెబ్బ కొట్టని పానీయం "రసాల"

పెరుగు మీద తేరుకున్న నీళ్ళు, పాలు కలగలిపి ఆరోగ్యకరమైన "రసాల" అనే పానీయాన్ని "భీముడు" తయారు చేశాడని "భావప్రకాశ" వైద్య గ్రంథంలో ఉంది. అరణ్యవాసంలో ఉన్నప్పుడు, పాండవుల దగ్గరకు శ్రీ కృష్ణుడు వస్తే, భీముడు స్వయంగా దీన్ని తయారు చేసి వడ్డించాడట! ఇది దప్పికని పోగొట్టి వడదెబ్బ తగలకుండా చేస్తుంది కాబట్టి, ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వారికి ఇచ్చే పానీయం ఇది. తన ఆశ్రమాన్ని సందర్శించటానికి శ్రీరాముడు వచ్చినప్పుడు భరద్వాజ మహర్షి రాముని గౌరవార్థం ఇచ్చిన విందులో రసాల కూడా ఉంది. భావ ప్రకాశ వైద్య గ్రంథంలో దీన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరంగా ఇచ్చారు

ఎండలోకి వెళ్లబోయే ముందు దీన్ని తాగండి

చక్కగా "చిలికిన మజ్జిగ" ఒక గ్లాసునిండా తీసుకోండి. అందులో ఒక "నిమ్మకాయ రసం", తగినంత "ఉప్పు", "పంచదార", చిటికెడంత "తినేసోడాఉప్పు" కలిపి తాగి అప్పుడు ఇంట్లోంచి బయటకు వెళ్లండి వడదెబ్బకొట్టకుండా ఉంటుంది. మరీ ఎక్కువ ఎండ తగిలిందనుకొంటే తిరిగి వచ్చిన తరువాత ఇంకోసారి త్రాగండి.

ఎండలో ప్రయాణాలు చేయవలసి వస్తే, ఒక సీసానిండా దీన్ని తయారు చేసుకొని వెంట తీసుకెళ్లండి. మాటిమాటికీ తాగుతూ ఉంటే వడదెబ్బ కొట్టదు.

మొన్న హైదరాబాదు నుండి తిరిగొస్తూ రైలు ప్రయాణంలో విజయా వారి మజ్జిగ నాలుగు ప్యాకెట్లు కొనుకున్నానండోయ్.


రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై





# చాలా విషయాలను మనం వదిలేయాలి !






★ వయసు పెరిగితే మనకేమీ కొమ్ములు పొడుచుకుని రావు. చాలా విషయాలను మనం వదిలేయాలి.'

★ "చలం" (గుడిపాటి వెంకటాచలం), గాయని వాణీ జయరామ్, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం గార్లను ఆదర్శంగా పెట్టుకోవాలి."

★ చలంగారు తానూ, తన స్నేహితుడూ ముచ్చటించుకుంటూ ఉండగా పిల్లలు వాళ్ళ ఇంట్లోని వంటపాత్రలతో ఆడుకుంటూ ధ్వనులు చేస్తుండగా స్నేహితుడా పిల్లలను వారించాడు.



★ అప్పుడు చలం "మనకు మన ముచ్చట్లు ఎంత ముఖ్యమో, ఆ పిల్లలకు వాళ్ల ఆటా అంతే ముఖ్యం. వయసులో పెద్దవాళ్లమైనంత మాత్రాన వాళ్ల ఆటలను ఆపెయ్యమనడానికి మనకు హక్కెక్కడిదీ ?" అన్నారు. ఇలాంటి ఉన్నతాలోచ నను పథాన్ని అలవరచుకునే ప్రయత్నంలో కొంత విజయం సాధించాలి.

★ వాణీ జయరామ్ గారు చిన్న పిల్లలను సైతం "మీరు" అనే సంబోధిస్తారు. ప్రయత్నించినా ఆ తత్త్వం అబ్బడంలేదు.

★ ఎస్పీ బాలు గారు శబరిమలకు డోలీలో వెళ్ళిన సందర్భంలో డోలీ మోసినవాళ్ళ కాళ్ళకు మొకరిల్లారు. అది వాళ్ళ వృత్తికావచ్చుగాక. వాళ్ళు ఆ పనిచేసినందుకు డబ్బులిస్తుండ వచ్చు గాక. వాళ్ళే లేకపోతే మనవద్ద డబ్బులుండీ లాభమేమిటి?

★ మనమెలాగూ ఎస్పీలాగా పాదాభివందనం చేసేంత గొప్పవాళ్లం కాలేం. కనీసం "థాంక్స్" చెప్పొచ్చు కదా.

★ కాగా ఒక సందర్భంలో "మన శరీరంలో తగినంత శక్తి ఉండగా ఇతరులకు డబ్బులిచ్చే అయినా బ్యాగులు మోయించొద్దు" అనీ "ఎవరిచేతనైతే నీ లగేజీని మోయిస్తావో వాళ్ళ పదింతల లగేజీని వచ్చే జన్మలో నీవు మోయకతప్పదు" అన్నారు శ్రీకంచి కామకోటి పీఠాధిపతి స్వామి గారు. చాలామటుకు దీనికీ కట్టుబడి ఉండే ప్రయత్నము చేయాలి.

★ మనం చాలా విషయాలను పట్టుకోవటం కష్టం కానీ వదిలేయడంలో బాధ ఏమిటీ? ఏం వదిలివేయాలో చూద్దాం :

"అమ్మాయీ గ్యాసు కట్టేసావా"!!

"గీజర్ ఆఫ్ చేసావా??"

"ఏ.సి ఆన్‌లో ఉన్నట్లుంది..."

"పాలు ఫ్రిజ్‌లో పెట్టావా??" లాంటి ఎంక్వయిరీలు వదిలేద్దాం.

★ "మా కొడుకూ, కోడలూ పట్టించుకోరు" అంటూ తామేదో పర్వతాలను మోస్తున్నట్లు బిల్డప్ ఇస్తూ తమ పరువు తామే తీసుకుంటున్న తలిదండ్రు లున్నారు.

★ వాళ్ళ హయాంలో వాళ్ళిష్టం... కష్టనష్టాలు కూడా వాళ్ళవే !! ఎవరితో ఏపనీ చేయించుకోకుండా, 'ప్రతీపనీ' "మన పనే" అనుకుంటే ఎంత ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండగలమో కదా !

★ 'నాకూ తెలుసు'తో పాటు "నాకు మాత్రమే తెలుసు" అనే ఆలోచనను తగ్గించుకుని, వాళ్ళకి చాలా విషయాలు, టెక్నాలజీ 'నాకంటే ఎక్కువ తెలుసు' కదా అనే నిజాన్ని ఒప్పేసుకుంటే చాలు. మన పిల్లలకోసం వచ్చేవారితో మనం మితంగా మాట్లాడాలి. "వాళ్ళు మనకోసం రాలేదు" అని గుర్తుంచుకుని కాసేపు కర్టెసీకి మాట్లాడి లేచి మన గదిలోకి మనం వెళ్ళిపోగలగాలి.

★ పెద్దవారిని పలకరించే మర్యాదతో ఎవరైనా సహజంగా అడుగుతారు "ఆరోగ్యం బాగుంది కదా" అని. దయచేసి వెంటనే అతిగా స్పందించవద్దు. మన బి.పి, షుగర్.., కీళ్ళనొప్పులు, నిద్ర పట్టకపోవటం.., నీరసం అంత రసవత్తరమైన విషయాలుకావు కదా. "బాబోయ్ ! ఎందుకు అడిగామా" అనే పశ్చాత్తాపం వారికి కలిగించవద్దు.

★ పెద్దతనంలో మన పరువును కాపాడుకోవటం పూర్తిగా... పూర్తిగా మన చేతుల్లోనే ఉందని ఘంటాపథంగా చెప్పగలను.

★ అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకుండా మితభాషిగావుంటూ మన ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోకుండా, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, జిహ్వాచాపల్యం తగ్గించుకుని.. అన్నింటికంటే ముఖ్యమైన విషయం "నన్ను ఎవరూ గౌర వించటంలేదు" అనే ఆత్మన్యూనతాభావం దరికి చేరకుండా జాగ్రత్తపడాలి...

★ భావం, బంధాలు, అంత తేలికగా తగ్గించుకోలేము.. కనీసం కొన్ని విషయా లను వదిలివేద్దాం.

★ హాయిగా పూజలు చేసుకోవచ్చు. భగవద్గీత, భాగవతం చదువుకోవచ్చు. పుణ్యమూ, పురుషార్థమూ కూడా సిద్ధిస్తాయి. ఇలా రోజూ అనుకుందాం :

I love my self...

respect my self ...

★ మన ఆత్మవిశ్వాసాన్ని పెంచే మంత్రాలివి. చివరగా మనం దిగవలసిన స్టేషన్ దగ్గరౌతూనే వుంది. సమయం దగ్గర పడుతూనే ఉంది.

★ మన బోగీలో ఉన్న మన తోటి ప్రయాణీకులతో తగువులు, మనస్పర్థలు, ఎత్తిపొడుపు మాటలు అవసరమా? మనం దిగుతుంటే వారి ముఖాల్లో 'హమ్మయ్య' అనే భావం కనిపించాలో లేక 'అయ్యో అప్పుడే వీళ్ల స్టేషన్ వచ్చేసిందా' అనే భావం కనిపించాలో నిర్ణయం మన చేతిలోనే ఉంది...

★ పెద్దతనం మనకో వరం. అది మన 'అహం' తగ్గించి మనకి జీవితం అంటే ఏమిటో, మన నిజమైన విలువ ఏమిటో సరియైన అవగాహన కల్పిస్తుంది. నస అనిపించుకునే కంటే నైస్ అనిపించుకోవడం మంచిది కదా ! "సర్వకాల సర్వావస్తేషు" ఘంటాపథంగా చెప్పగలను. మన గౌరవం మన చేతుల్లోనే ఉంది.

★ మనం చేయగలిగినంత చేయాలి. కానీ ఇతరులను కొడుకూ కోడళ్లనైనా, కూతురూ అల్లుళ్లనైనా సరే "చేయలేదు," "చేయడంలేదు" అనవద్దు. అంటే విలువ తగ్గడమే ఖాయం.

★ విలువను పెంచుకోవడమైనా, ఉంచుకోవడమైనా, తుంచుకోవడమైనా మన చేతుల్లోనే ఉన్నదనేది మాత్రం నిష్ఠురసత్యం!!

# అహం వీడితే అంతా ఆనందమే

'అహం' చూడడానికి రెండక్షరాలైనా ఈ చిన్ని పదం ఎంతటివారినైనా మాయలా. కప్పేస్తుంది. లోకం పోకడ తెలియనివ్వకుండా, తెలుసుకోకుండా చేస్తుంది. తాను ఉన్నదే. ప్రపంచం, తాను నమ్మించే అసలైన సిద్ధాంతం, తాను చేసిందే సరియైనది అనే దృఢమైన భావనల్ని ఉసిగొల్పి, చివరికి వారినే అందరూ ఉన్న ఒంటరివారిని చేస్తుంది.

అహం అంటే నేను అని అర్థం. కాని అసలు అంతరార్థం మాత్రం చాలా సంక్లిష్టమైనది. ఈ చిన్ని పదం నుండి పుట్టినదే అహంకారం, అహంభావం, గర్వం, ఈ అహం అనే భావన చిన్నగా కనిపించినా చాలు అది మహావృక్షంలా మనలో వ్యాపిస్తుంది.

దీనిని నివారించుకోవడం మన చేతిలోనే ఉంది. పాండిత్యం అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా మన పరిసరాల పరమార్థం తెలుసుకోవాలి. విద్య మనకు వినయం నేర్పి కలిసిమెలిసి ఎలా బ్రతకాలో చెప్తుంది. ఇదంతా పుస్తకాల నుండి కాక మనకు ఎదురైన అనుభవాలతోనే సాధ్యమవుతుంది. ఒదిగి ఎదగడంలోనే ఔన్నత్యం ఉంది.

ఐతే మిడిమిడి జ్ఞానం ఉన్నవారు అన్నీ తమకే తెలుసన్న అతి విశ్వాసంతో ఉంటారు. ప్రతీదానికి వితండవాదం చేస్తారు.

ప్రతి మనిషికి తనపై తనకు పూర్తి నమ్మకముండాలి. అది తప్పనిసరి. ఇది ఆత్మవిశ్వాసం. లేకుంటే తనకంటే దురదృష్టవంతులు, హీనులు, అజ్ఞానులు లేరనే ఆత్మన్యూనత ఏర్పడుతుంది. ఇది చాలా ప్రమాదకరమైనది. మనిషిని క్రుంగదీస్తుంది. అదేవిధంగా అతివిశ్వాసం కూడా మంచిది కాదు. తనకంటే గొప్పవాడు లేదు అని అనుకుని ఎదుటివారిని చులకన చేస్తుంటారు. జ్ఞానం, లోకానుభవమున్న పండితులు సంస్కారవంతులై గౌరవింపబడతారు. మిడిమిడి జ్ఞానమున్నవారే అహంకారంతో విర్రవీగుతారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక నేర్పు ఉంటుంది. తనకే అన్నీ తెలుసు అనే అహంకారం మంచిది కాదు. నేర్చుకోవడానికి ఏదో ఒకటి కొత్తది ఉంటూనే ఉంటుంది. వినయంతో తెలుసుకోవాలి. తమలోని జ్ఞానసంపదని ఇనుమడింప చేసుకోవాలి.

'నేను' అన్న స్వార్థచింతన వీడి 'మన' అనే సమిష్టి తత్త్వం అలవరుచుకోవాలి. ఇదే మన ముందున్న తరాలవారికి నేర్పించాల్సిన గొప్ప సంస్కారం, పాఠం,

# కర్ణ విలాపం (చెవి గోల) నేను మీ చెవిని

మేమిద్దరము, కవలలము. కానీ మా దురదృష్టమేమిటంటే, ఇప్పటి వరకు మేము ఒకరినొకరు చూసుకోలేదు. ఏ శాపమో తెలియదు మేము ఎడ మొహం పెడ మొహంగా అమర్చబడ్డాము.

మా బాధ్యత కేవలము వినడము మాత్రమే. తిట్లు, చప్పట్లు, మంచి, చెడు, అన్నీ మేము వింటాము.

కానీ క్రమక్రమంగా మమ్మల్ని వస్తువుల్ని వేలాడదీసే ఆధారాలుగా మార్చేశారు. కళ్ళజోడు బరువును మాపై మోపుతున్నారు. సమస్య కళ్ళదైతే, సావు మోత మాకేమిటి?

బాల్యంలో చదువుకునేటప్పుడు ఎవరికైనా మెదడు పని చేయకపోతే మాస్టరు గారు మమ్మల్నే మెలేస్తారు.

యవ్వనంలో పురుషులు, మహిళలు అందరూ అందమైన జూకాలు, కమ్మలు, లోలక్కులు, మొదలైనవి చేయించుకొని మాపైన వేలాడదీస్తారు. రంధ్రాలు చేయడం, రక్తాలు కారడం మాకైతే, పొగడ్తలు మాత్రము ముఖానికి. ఇక అలంకరణ చూడండి!

కండ్లకు కాటుక, ముఖానికి క్రీములు పెదవులకు లిపిస్టిక్, మరి మాపై ఎందుకు వివక్ష?

ఎప్పుడైనా ఏ కవి అయినా ఏ శాయరీ అయినా చెవుల గురించి ప్రశంసిస్తూ పొగిడితే చెప్పండి. వారి దృష్టిలో కళ్ళు, పెదవులు, చెంపలు ఇవే సర్వస్వము.

కళ్లకు బాధ కలిగితే కన్నీరు కారుస్తాయి. ముక్కుకు బాధకలిగితే చీదుతుంది, నోటికి బాధ కలిగితే అబ్బో, అయ్యో అని మొత్తుకుంటుంది. మరి మాకు బాధ కలిగితే బయటకు తెలియకుండా లో లోపలే భరించాలి.

ఇక పోతే పెన్నులు, పెన్సిళ్లు, అగ్గి పుల్లలు, సిగరెట్లు, బీడీలు, ఇలా ఎవరికి కావలసింది వారు మా మీద దాస్తుంటారు.

ఇదివరకు హెడ్ ఫోన్లని మాకు మూతలు వేసేవారు, ఇప్పుడు పైత్యం పెరిగి, ఇయర్ ఫోన్లని మాలోపలికి తోసి మమ్మల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు. ఏమండీ ఒక్కసారి మీ ముక్కుకు నోరుకు మూతవేసి చూడండి ఏం జరుగుతుందో.

మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు కరోనా మాయరోగం మా చావుకు వచ్చింది. ముక్కు, మూతి మూసుకోవడానికి వేసుకునే మాస్కులను కూడా మాకే తగిలిస్తున్నారు.

మేము చెవులమండీ, చెక్క కొయ్యలం కాదు, ఏది పడితే అది వ్రేలాడెయ్య డానికి.



మీకిష్టమొచ్చినట్లు కాకుండా మా పనికి మాత్రమే మమ్మల్ని వాడండి. చెవులే కదా అని చిన్న చూపు చూడకండి. మేం సంయమనం కోల్పోయామంటే మీరు కళ్ళు తిరిగి కింద పడతారు.

అందరికి నవ్వుల శుభ శుభమధ్యాహ్నం.

## భోగరాజు వారి హితోక్తి

డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యలో దేశభక్తితో బాటు గొప్ప వ్యాపార దక్షత కూడా వుంది. ముందుచూపుతో బందరులో అతి చిన్న స్థాయిలో స్థాపించిన సంస్థలు నేడు విశ్వవ్యాప్తం అయినాయి. పొదుపరి, నిరాడంబరుడుగా పేరు పొందాడు. ఒకసారి ఓ ఆప్తమిత్రుడు కూతురు పెళ్లి కోసం అయిదువేలు అప్పు కావాలని పట్టాభి గారిని అడిగాడు.

"నేనెందుకు, ఫలానాచోట తీసుకోవచ్చు కదా" అని మిత్రునికిస్తూ ప్రశ్నించారట. అందుకు మిత్రుడు "అక్కడైతే పన్నెండు శాతం వడ్డీ, నువ్వైతే పది శాతానికే యిస్తావని..." అని నసిగాడాయన.

పట్టాభి కాసేపు మౌనంగా మనసులోనే లెక్కలు కట్టి, మిత్రుడు అడిగిన అయిదువేలకు రెండు శాతం వడ్డీ కట్టి, ఆ తేడా మొత్తం మిత్రునికిచ్చి, "వెళ్లి అక్కడే డబ్బు తెచ్చుకో. డబ్బు లావాదేవీలు స్నేహాన్ని పాడుచేస్తాయి" అని హితవు చెప్పి పంపేశారట.



# సద్గురువు
# నరసింహ సరస్వతీ స్వామి

అది సరిగ్గా మాఘమాసం (అంటే ఫిబ్రవరి ప్రాంతం) కృష్ణ పక్షం శుక్రవారం – అనగా 15వ శతాబ్దిలోని బహుధాన్య సంవత్సరంలో ఉత్తరాయణ పుణ్యకాల శుభఘడియల్లో ఓ మహానుభావుడు, దత్తావతారాంశుడు శ్రీశైల సన్నిధిని ప్రవహించే కృష్ణానదిలో పుష్పాసనమీద ఉపవిష్టుడై, ప్రవాహంతో బాటు శిష్యులకు వీడ్కోలు చెబుతూ వెళ్లిపోయారు. తాను అదృశ్యం కాగానే నాలుగు పువ్వులు మీ నలుగురు దరికీ ఎదురుగా ప్రవహించి వస్తాయ్. నేనెపుడూ మీ నలుగురి వద్దనే ఉంటాను. చింతించకండి – అన్నారా నారింజవర్ణ వస్త్రాలను ధరించిన ఆ ఋషివరేణ్యుడు.

ఆయనెవరో కాదు, ఆయనే నృసింహ సరస్వతి స్వామి. దత్తావతారంలో రెండవ అవతారమైన దత్తావతారమే శ్రీ నరసింహ సరస్వతీ స్వామివారు. శ్రీ గురుచరిత్ర చదివిన వారికి నరసింహ సరస్వతీ స్వాములవారిని గురించి వివరంగా విదితమవుతుంది. వారి మహిమలు అనన్య సామాన్యమైనవి.

1378 సం॥ము కరంజ నగరంలో శివభక్తీ పరాయణులైన మాధవశర్మ, అంబభవానీ దంపతుల పుత్రరత్నంగా శ్రీ స్వామివారు ఉదయించారు. ఆ దంపతులు పదహారు సంవత్సరాలపాటు శని ప్రదోష పూజలు చేసిన అనంతరం పుత్రోదయం కల్గింది. శుక్ల పక్ష శశాంకునిలా పెరిగి ఏడు సంవత్సరములు వయసు వచ్చిననూ ఆ బిడ్డకు మాటలు రాకపోవడం తల్లిదండ్రులను విషాదంలో ముంచింది. సంతోషం నీళ్లుగారింది. కారుమేఘాల్లో మెరుపు మెరిసినట్లు వారికో ఆలోచన కల్గి, పుత్రునికి ఉపనయనం చేసిన మాటలు వస్తాయనెడి అభిప్రాయం కల్గింది. ఓ సుముహూర్తాన ఉపనయనం చేశారు. వారి నమ్మకం వమ్ము కాలేదు. చక్కగా మాటలు రావడమే గాకుండా గాయత్రీ శ్లోకములను చక్కగా చెప్పదొడగాడు. ఆ దంపతుల ఆనందానికి అవధుల్లేవు. ఆ ఆనందం ఎన్నో క్షణాలు నిలువలేదు. రాయి విరిగి మీదపడినట్టు–జననీ జనకులారా–నన్ను సన్యసించుటకు అనుమతి యివ్వండి, నేను దేశాటనం చేయాలనుకుంటు న్నాను అన్నారు. ఆనందం ఆవేదనగా మారింది. "కుమారా–నీకోసం పదహారు వత్సరములు ప్రదోషవ్రతం చేశాం. నీవు పుట్టావని ఎంతగానో ఆనందించాం – ఏడాది గడిచినా మాటలు రానందుకు కుమిలిపోయాం. ఏడేండ్లు ఎదురుచూచి ఉపనయనం చేసి గాయత్రోపాసనం చేయిస్తే మాటలు వస్తాయని విశ్వసించాం. ఈశ్వరానుగ్రహంతో మా విశ్వాసం ఫలించింది. నీనోట పలుకులు శ్రవణపేయంగా ఆందిస్తూన్న క్షణంలోనే – ఏంటిటి నాయనా ఇలా మాట్లాడుతున్నావ్ – నిను విడిచి మేమెలా బ్రతకగలమయా, నీవు వివాహం చేసుకుని, తరువాత మను ధర్మానుసారం సన్యసించు నాయనా అని కోరారు.

కానీ ఆ వటువు మనసు మార్చుకోలేదు. 'అమ్మా – నీకు మరో సంతతి కలిగాక – సన్యసిస్తానన్నారు. తరువాతి సంవత్సరంలో వాళ్లకు ఇద్దరు కవల మగపిల్లలు పుట్టారు. తల్లిదండ్రులను సమ్మతింపచేసి, గృహ పరిత్యాగం చేశారు. అప్పటికా బిడ్డడి వయసు ఎనిమిది సంవత్సరములే! అలాగే కాలినడకన కాశీకి బయల్దేరి వెళ్ళాడు. ముప్పూటలా గంగలో స్నానం చేయడం, సంధ్య వార్చడం అక్కడి వారందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేయడంతో అక్కడి శృంగేరీ మఠంలోని కృష్ణ సరస్వతీ స్వామివారి చెవిని పడింది. ఆయన విద్యారణ్య సాంప్రదాయానికి చెందినవారు. ఇలాటి బాలుడును తమ సాంప్రదాయాలలో చేర్చుకుంటే సనాతన ధర్మం శోభిస్తుందని భావించి, తమ మఠానికి ఆహ్వానించారు. నరహరి స్వామి వారి ఆప్యాయతను చూచి, వారి ఆహ్వానాన్ని అంగీకరించి, వారినుంచి సన్యాసం గ్రహించి, ఆశ్రమ స్వీకారం చేశారు. కృష్ణ సరస్వతీ యతీంద్రులు నరహరికి నరసింహ సరస్వతి నామకరణం చేశారు. ఆశ్రమంలో ఉండి ఎంతమందినో వేదవిదితులైన స్వాములుగా శిక్షణ యిచ్చారు. అటుతరువాత గంగాతీర ప్రాంతాలైన బదరి, కేదారం, ప్రయాగ వంటి గంగా తీర క్షేత్రాలన్నిటినీ పర్యటించారు. ఈ పర్యటనలో ఎంతోమంది శిష్యులు ఆయన చెంత చేరారు. వారిలో ఏడుగురిని తనకూడా తీసుకుని దేశపర్యటన సాగించారు. అలా 30 సం॥ములు పర్యటించి, కరంజీనగరం చేరుకున్నారు. తల్లిదండ్రులు నరసింహ సరస్వతిని చూచి, అతని మహిమల్ని విని ఎంతగానో ఆనందించారు. తల్లికి ఆ యిద్దరు కొడుకులతో బాటు, మరో అమ్మాయి పుట్టడం కూడా ఆయనకు ఆనందహేతువైనది. కొద్ది రోజులు అక్కడనే ఉండి త్రయంబకేశ్వరం వెళ్లారు. పిన్నవయసులోనే అన్ని క్షేత్రాలను పాదాచారియై తిరిగారు. అసలు స్వామి పుట్టినప్పుడే ప్రణవముచ్చ రించడం, ఓ వింత. ఆయన కరస్పర్శచే ఇనుము బంగారంగా మారడం, వేదాలు అభ్యసించకుండానే ఆయన వేదపాఠాలను చెప్పడం, దారుణ ఉదరకోశ బాధ పడ్తూన్న వానికి నివారణ చేయడం, నిరుపేద బ్రాహ్మణుని దారిద్ర్యం పోగొట్టడం, ఎండిన మ్రానుని చిగురింపచేయడం, చాకలివానిని చక్రవర్తి చేయడం, అంత్యజుని నోట వేదం పలికించడం, వృద్ధ గొడ్రాలికి పుత్రో దయం కల్గించడం, కుష్ఠురోగి రోగం కుదర్చడం, కోసిన చేనులో తిరిగి సమృద్ధిగా పంటను పండింపచేయడం, ఇలా ఎన్నో మహిమలను నరసింహ సరస్వతీ స్వాములవారు చేశారు. స్వామివారిది దత్తాత్రేయుల రెండవ అవతారమనీ, మొదటి అవతారం శ్రీపాదవల్లభులనీ గురుచరిత్ర చెబుతూంది!

వారుచేసిన మహత్త్యముల్లో మరిన్ని విషయాలున్నాయ్. గొడ్డుబర్రెనుంచీ పాలు పితికించడం, చచ్చినవాడిని బ్రతికించడం, ఒకేరోజున, ఒకే సందర్భములో ఎనిమిది గ్రామాల వారిని అనుగ్రహిస్తూ, వారికి దర్శనమిచ్చి ఆశీర్వదించడం వంటి వెన్నో, ఎన్నెన్నో!

అది 1294 సం॥ ప్రాంతం. మహమ్మదీయ రాజులు దేవగిరి రాజులను జయించి, 3 శతాబ్దాల వరకూ తమ రాజ్యాన్ని విస్తరిస్తూ వచ్చారు. మహ్మదీయ రాజుల పాలనా కాలంలో హిందూ సామ్రాజ్యం, రాజులు భారతధర్మం క్షీణిస్తూ వచ్చింది. ఆ సందర్భంలో మహారాష్ట్రలో హిందూ ధర్మ పునరుద్ధరణ నిమిత్తం, హిందూ మహమ్మదీయ ద్వేష నిర్మూలన నిమిత్తం ఎందరో మహాత్పురుషు లుదయించి ధర్మాన్ని సడలకుండా చేస్తూ వచ్చారు. పదిహేడవ శతాబ్దం వచ్చే సరికి శివాజీ మహారాజు విజృంభించారు. సమర్ధ రామదాసు గురూ ఆశీర్వాదంతో హిందూ ధర్మ పునస్థాపనం జరిగింది. నరసింహ సరస్వతీ స్వామివారు అదృశ్యు లైననూ, ఆయన తన మహిమల్ని చూపుతూనే వచ్చారు. సత్పురుషులైన సాధువులు, పీఠాధీశులూ దక్షిణాదిని వెలయదానికీ, సనాతన ధర్మ పునస్థాపనకూ శ్రీ నరసింహ సరస్వతీస్వామివారినే సదా స్మరించుకోవాలి! ●

Continued From Page No. 2





ఈ కుంబాభిషేక కార్యక్రమంలో టీ టీ డి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి దంపతులు ,చెన్నై సలహా మండలి అధ్యక్షులు ఏ జే శేఖర్ దంపతులు , ఉపాధ్యక్షులు,చెన్నై సలహామండలిసభ్యులు ,డెప్యుటీ ఈ వో మరియు చెన్నై నగర ప్రముఖులు పాల్గొన్నారు. విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర స్వామివారు విచ్చేసి తన అనుగ్రహ భాషణాన్ని అందించారు.

# ప్రముఖ పారిశ్రామికవేత్త నరసారెడ్డి కుమార్తె వివాహం



కెన్సస్‌గ్రూప్ అధినేత, తెలుగు ప్రముఖులు నరసారెడ్డి లక్ష్మి దంపతుల కుమార్తె సంయుక్త , పారిశ్రామికవేత్త సిద్ధారెడ్డి వెంకటసుదర్శన రెడ్డి అశ్విని దంపతుల కుమారుడు సిధార్థ్ వివాహం అత్యంత వైభవంగా మహాబలిపురం వెల్కమ్ హొటల్ కెన్సస్ ఫామ్‌బీచ్ లో జరిగింది. మార్చి 11 ఉదయం వివాహం సాయంత్రం రిసెప్షన్ వేడుకగా జరిగాయి. ఈ వివాహ వేడుకలలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు మరియు ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు మిత్రులు బంధువులు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలు చెన్నై సిటీ కు కొంచెం దూరంగా జరిగినా ఇంతమంది పాల్గొన్నారంటే వారందరికీ నరసారెడ్డి పట్ల వున్న గౌరవ మర్యాదలే కారణం . నూతన దంపతులు సంయుక్త సిదార్థ్ లకు ప్రముఖాంధ్ర శుభాకాంక్షలు అందజేస్తోంది.





Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**April 2023**

